శ్రీ

చింతామణి.

ఇది మాసమున కొకసారి ప్రకటింపఁబడును.

సంపుటము ౭] రాజమహేంద్రవరము. [సంచిక. ౪.
హేవిళంబిసంవత్సర ఆశ్వయుజమాసము.

శ్రీ వివేకానందసరస్వతీస్వాములవారు.

శ్రీమాన్ వివేకానందసరస్వతీ స్వాములవారి కీర్తి వర్తమానమందు జగద్విఖ్యాతమై యున్నది. అయిదువత్సరములకుఁ బూర్వము వీరి నామమైన నెఱిగినవారులేరు. ఇప్పుడన్నన్నో పూర్వపశ్చిమఖండములలో వీరినామ మెఱుంగనివారులేరు. ఆశ్రమస్వీకారమునకుఁ బూర్వము వీరినామము నరేంద్రనాథదత్తుగారు. కలకత్తా నగరములో ఘనతకెక్కిన న్యాయవాది కుటుంబములో నరేంద్రనాథదత్తుగారు ౧౮౬౩ వ సంవత్సరమున జననమొందిరి. ఈయన తండ్రిగారగు విశ్వనాథదత్తుగారు ౧౮౬౦-౧౮౭౦ సంవత్సరముల మధ్యకాలమందు మధ్యరాష్ట్రములలోని ప్రధాన న్యాయస్థానమున అట్టర్నీ (న్యాయవాది) గా పనిజేయుచుండిరి. తరువాత కలకత్తానగరమునకుఁ బోయి పూర్వము తమ తండ్రిగారివలెనే న్యాయవాదిపదమున ఘనతకెక్కిరి. ఆ కాలమందును వర్తమానమందును కలకత్తా న్యాయవాదులలో ప్రాముఖ్యతఁ జెంది యగ్రగణ్యులగు డబ్లియు. సి. బనర్జీగారికిని దత్తుగారి కుటుంబమునకును విశేషమైన మైత్రికలదు. సౌందర్య తేజోనిధియు, ప్రజ్ఞావంతుడును, సులక్షణసంపన్నుడునునగు నరేంద్రనాథుగారియందు బనర్జీగారికి నపరిమితమైన ప్రేమ యుద్భవించెను. నరేంద్రనాథుగారి విద్యాభ్యాసన కాలమునుగూర్చి మన కంతగా దెలియదు. పాఠశాలలోని విద్యార్థులతో సన్యోన్యముగా నుండెననియు, పఠనగ్రంథములను బాగుగ జదువకపోయినను, పరీక్షల యందు శ్లాఘనీయముగా కృతార్థుడయ్యెననియు, ౧౮౮౪ వ సంవత్సరమున బట్ట పరీక్షయందు కృతార్థుడైనప్పుడు విద్వాంసుడనియును మేధావంతుడనియు సుగుణసంపన్నుడనియును ఖ్యాతిగాంచెననియు దెలియవచ్చుచున్నది. దత్తుగారి తండ్రి తాతలు న్యాయవాదులని చెప్పియున్నారము. కుటుంబాచారము ననుసరించి నరేంద్రనాథుగారి

నొక న్యాయవాదియొద్ద పనినేర్చుకొనుట కొప్పగించిరి ఆపనియందు దత్తుగారి కెంత మాత్రము ఇష్టములేకపోయినను, పనినేర్చుకొనవలసివచ్చెను ఆపనియందు శ్రద్ధవహించి న్యాయవాదిపదము నొందినయెడల నరేంద్రనాథుగారు న్యాయవాదులలో మిగుల ప్రసిద్ధి గాంచియుందురనుట కెంతమాత్రమును సందియములేదు కాని యాకాలమందు నరేంద్రనాథుగారు తత్వసంబంధమైన విషయములను గూర్చి యాలోచించుచుండిరి ఆయనకు పిన్ననాటనుండియు మతవిషయములను దెలిసికొనుటయందు విశేషమైన యభిలాష కలదు. కొంతకాలము మతవిషయములనుగూర్చి నేర్చుకొని జగద్విఖ్యాతమైన ప్రసిద్ధిగాంచి వర్తమానమందు జగద్గురువులుగా నెన్నబడుచున్న దత్తుగా రెంత వయస్సునందు శ్రీ రామకృష్ణ పరమహంసగారితో కృతపరిచయులయిరో మనకు దెలియరాకున్నది. ఆకాలమందు వంగదేశములో శ్రీ రామకృష్ణపరమహంస, దయానంద సరస్వతి, కేశవచంద్రసేను, దేవేంద్రనాథ టాకూర్ మొదలగు మతోద్ధారకులందరు మతవిషయములఁగూర్చి చర్చచేయుచుండిరి వీరిలో నొక్కొక్కరినిగూర్చి యొక్కొక్క గ్రంథము వ్రాయవచ్చును. వారందరు హిందూమతవిషయమై చేసిన మహోపకారము లింతింత యని చెప్ప నలవిగాదు. వీరి నామోచ్చారణమాత్రముననే వీరికాలమందు మతవిషయములం దెట్టి విశేషజ్ఞులుండిరో తేటపడగలదు వారందరిలో ప్రాముఖ్యత వహించినది శ్రీ రామకృష్ణపరమహంసగారనియే చెప్పుట కెంతమాత్రమును సందియము లేదు. వంగదేశపు విద్యావిషయ ప్రధానోద్యోగియులగు సి- ఎచ్- టానీ, యమ్- ఏ- దొరవారు ౧౮౯౬ వ సంవత్సరము జనవరినెలలో ఆసియాఖండపు మాసత్రయ పత్రికయందు శ్రీ పరమహంసగారినిగూర్చి ఈక్రింద వివరించినట్లు వ్రాసియున్నారు "ఈ మహామహుఁడు వంగదేశపు శాస్త్రపాఠశాలలోఁ జదువుకొను బాలుర మనస్సులను గరగించి, వారికి హిందూమతమునం దభిరుచిఁ బుట్టించినాడనుట కెంతమాత్రమును సంశయములేదు. ఈ మహానుభావుని యుపదేశములు హిందూమతోద్ధారణకు మిగుల సహకారిగా నుండునని యొక్కి వక్కాణింపవచ్చును" శ్రీ పరమహంసగారి బోధనల వలన కేశవచంద్రసేనుగారికిఁ గలిగిన లాభములఁగూర్చి ప్రతాపచంద్రముజూమ్దారు గారు సాక్షీభూతులుగనున్నారు. ప్రొఫెసరు మాక్సుమూలరువారుకూడ శ్రీ పరమహంస గారినిగూర్చి విశేషముగా వ్రాసియున్నారు. "బ్రహ్మసమాజమునకు నాయకులుగా నుండిన ప్రతాపచంద్రముజూమ్దారుగారు, తమకున్ను కేశవచంద్రసేనుగారికిని, కలకత్తానగరమునందలి విద్యాధికుల కనేకులకును శ్రీ పరమహంస రామకృష్ణగారి బోధనలవలన గలిగిన లాభములఁగూర్చి నాతోఁ జెప్పియున్నారు వారికి శిష్యులుగా నున్న బాలు రనేకులు వారి మరణానంతరము మునివృత్తి నవలంబించిరి. ఇహలోకము

నందలి సంసారసౌఖ్యముల విడఁనాడి సమీపమందలి యొక మఠమునందు నివసించుచు, మధ్యమధ్యను హిందూదేశమందలి పుణ్యక్షేత్రములకుఁ బోయి, హిమవత్పర్వతము మొదలగు నిర్జనప్రదేశముల విహరింపుచు, వారి శిష్యులలో ననేకులు సన్యాసాశ్రమమును గైకొనియున్నవారు. వారి శిష్యులలోఁ గొందరు గృహస్థాశ్రమమునందే యుండి పరమహంసగారి మతబోధానుసారముగాఁ బ్రవర్తించుచున్నారు కేశవచంద్రసేనుగారి యవసానకాలములో పరమహంసగారి యుపదేశములయందు వారికి దృఢమైన నమ్మకము కలిగినది కేశవచంద్రసేనుగారి మతాభిప్రాయములలో నిట్టిమార్పు కలిగినందుకు వారి స్నేహితు లనేకులు మిక్కిలి యాశ్చర్యపడిరి మతసంస్కరణులని పేరువడసిన కేశవచంద్రసేనుగారు వారి యంత్యావస్థయందు మతవిషయములందు భిన్నాభిప్రాయులై తమ స్నేహితుల కందఱకు నత్యాశ్చర్యము వొడమునట్లు నూతన మతావలంబకు లగుటకు ముఖ్యకారణ మీ పరమహంసగారి మతబోధయేయని వేఱుగఁ జెప్పఁ నక్కరలేదు కేశవచంద్రసేనుగారి నూతన మతాభిప్రాయములలో ముఖ్యముగా భగవంతుని మాతృభావమును గూర్చి వారు బోధించుచువచ్చిన మతసిద్ధాంతములఁ బట్టి వారి యాంగ్లేయస్నేహితు లనేకులు వారిని వదలివేసిరిగాని హిందువులకుమాత్రము వారియందు మిక్కిలి యనురాగము కలిగినదనుట కెంతమాత్రమును సంశయము లేదు అదెట్లున్నను, బ్రహ్మసమాజస్థాపకులగు కేశవచంద్రసేనుగారి యభిప్రాయభేదములకు ముఖ్యమైన కారణ మిప్పుడు వెల్లడియైనది. కేశవచంద్రుగారికి మన స్థైర్యము చెడిన హేతువుచే నిట్టి యభిప్రాయభేదము కలిగియుండునని కొందరిదివరలో జేసిన యూహ సరియైనది కాదనికూడ స్పష్టమైనది" అని మాక్సుమూలరుగారు వ్రాసియున్నారు మన దత్తుగారికిఁ జిన్నవయసునందే శ్రీ పరమహంసగారి యుపదేశములయందు విశేషముగా నమ్మకము కలిగినదనుట కెంతమాత్రమును సందేహము లేదు. ఆ కాలమునందు వంగదేశములో సాధారణముగా వ్యాపించియున్న భజనకూటము లన్నిటికి నరేంద్రుగారు తప్పక పోవుచుండిరి తత్తుగారికి గానమందు మిక్కిలి యభిలాషకలదు గానవిద్యయందును, సంగీతశాస్త్రమునందును వారికి విశేషమైన ప్రజ్ఞకలదు ౧౮౮౪ వ సంవత్సరమునందు దత్తుగారు పట్టపరీక్షలో కృతార్థులగుటకు బూర్వము వారికీసంసార సౌఖ్యముల విడిచిపెట్టవలెనను యభిప్రాయ మంతగా నున్నట్లు కానుపింపదు ఆసంవత్సరానంతరమునుండి వ్యవహారములు మారినవి దత్తుగారు న్యాయవాదిపని నేర్చుకొను కాలములోగూడ తరుచు పరమహంసగారియొద్దకుఁ బోవుచుండిరి సహాయ రసవాద పరీక్షకులుగానుండి, రసవాదశాస్త్రవిషయసంఘ సామాజికులగు దత్తుగారి జ్ఞాతియైన రామచంద్రదత్తు బి. ఏ. గారివలన నీయనకు ప్రథమములో శ్రీ పరమహంసగారితోఁ

బరిచయము కలిగెను తరువాత సంవత్సరమునకు లోపలనే మన దత్తుగారు సన్న్యాసాశ్రమమునఁ బ్రవేశించిరి పరమహంసగారి శిష్యులలో వీరు ముఖ్యులు స్వామిగారియందు పరమహంసగారికి విశేషమైన యనురాగము కలదు. కేశవునికొక శక్తియే కలదు కాని నరేంద్రునికి పదునెనిమిది శక్తులుగలవని పరమహంసగారొకప్పుడు చెప్పిరట నరేంద్రునికి బ్రహ్మజ్ఞానమును భగవద్భక్తియుగూడ విశేషముగా నున్నవని పరమహంసగారు మరియొకప్పుడు చెప్పినట్లు తెలియవచ్చుచున్నది. తన బుద్ధిబలముచేతను, ఆధ్యాత్మికశక్తిచేతను నరేంద్రుడు ప్రపంచమంతయు గంపింపజేయగలడని పరమహంసగారు వ్రాసిచ్చిరి ౧౮౮౬ వ సంవత్సరము ఆగష్టునెలలో శ్రీ పరమహంసగారు లోకాంతరగతులైరి

శ్రీ పరమహంసగారి మరణానంతరము వారి శిష్యుల దరును చెదిరిపోయి కొంతకాలము వరకు దేశాటనము సలుపుచుండిరి వివేకానందులవారు హిమవత్పర్వతములకుఁ బోయిరి కొందరు టిబెటుదేశమునకును కొందరు కాశ్మీరదేశమునకును, మరికొందరితరస్థలములకును బోయిరి శిష్యులందరీప్రకారము దేశాటనము సలుపుచు గొంతకాలము గడపిరి తరువాత కొంతకాలమునకు వివేకానందులవారు వంగదేశమునకు వచ్చి, శ్రీ పరమహంసగారి శిష్యులనందఱు నొకచోటకుఁ జేరిరి మరియు నొకదాని నేర్పఱచుకొని, శ్రీ పరమహంసగారి శిష్యులందరు దానిలో నివసించుచుండిరి

వివేకానందులవారును వారి యనుచరులును సాధారణముగా మనము చూచుచుండిన సన్న్యాసులవంటివారు కారు మఠములలో నివసించి కొంతకాలమునకు సమస్తవిధములను చెడిపోయిన సన్న్యాసుల నెందరినో మన మెఱిఁగియున్నాము. వీర లట్టివారలు కారు స్వదేశస్థులయొక్కయు, మానవజాతియొక్కయు క్షేమలాభములకై శ్రమపడుటయే శ్రీ స్వామివారి ముఖ్యోద్దేశ్యమైయున్నది. వారి యుద్దేశములు నేరవేర్చుకొనుటకై శ్రీ వివేకానందులవారు కలకత్తానగరమును వదలి దేశాటనమునకుఁ బయలువెడలిరి చీనా, జపానుదేశములందును, టిబెటు, కాశ్మీరము మొదలగు దేశములందును, హిందూదేశమందలి యన్నిభాగములయందును సంచరించిరి దేశాటనము సలుపుటలో శ్రీస్వామివారు చేసిన పనులనుగూర్చి చిత్రకథ లనేకములుగలవు. శ్రీస్వామివారు ద్రవ్యము నపేక్షింపరు ఆహారమునుగోరరు. అట్టి స్థితిలో శ్రీస్వామివారు ఆసియాఖండమునందంతట నెట్లు ప్రయాణము చేసిరో, ఎట్టికష్టములకులోనై, శ్రమలనోర్చిరో మన మూహింపఁజాలకున్నాము. ౧౮౯౨ వ సంవత్సరము ఆగస్టునెలలో శ్రీస్వాములవారు తిరువనంతపురంబునకు విచ్చేసిరి. ఆకాలమునందు చెన్నపట్టణమునందు సహాయలేఖకోద్యోగియులగు (Assistant Accountant General) యమ్-భట్టాచార్య

యమ్- ఏ- గారు పరీక్షనిమిత్తము తిరువనంతపురమునకుఁబోయి వివేకానందులవారి దర్శనముచేసి వారిని చెన్నపురమునకుఁ దోడుకొనివచ్చిరి. శ్రీ స్వాములవారింతకు బూర్వ మెన్నఁడును తమ యభిప్రాయములనుగూర్చి వెల్లడిచేయలేదు ఈయనకు గల సహజ వాగ్ధోరణాశక్తియు, పెక్కుభాషలయందలి పరిశ్రమయు, ప్రజలకు వెల్లడికాలేదు ఈయన శరీరసౌందర్యము మిగుల శ్లాఘనీయము ఈయన మైలాపురియందు భట్టాచార్యులవారిగృహమునందు నివసించు కాలమునందు వీరికి మదరాసునందు ప్రాముఖ్యత వహించియున్న కొందరికిని పరిచయము కలిగినది. ౧౮౯౨వ సంవత్సరాంతమునం దీప్రకారము శ్రీస్వాములవారిసంగతి మదరాసులో గొందరికి దెలియవచ్చినది అది మొదలు శ్రీస్వాములవారినిగూర్చి విచిత్రమైనకథలు పట్టణమునందంతట వ్యాపించినవి. ప్రాగ్పశ్చిమదేశ వేదాంతశాస్త్ర ప్రావీణులును, మృదుమధుర వాగ్ధోరణీ నైపుణులును, ఆంగ్లేయభాషా విశారదులునునగు స్వాములవారొకరు పట్టణమునకు విచ్చేసిరని జన ప్రతీతి పలుచోట్ల వినవచ్చెను, నిరీశ్వరవాదులును, నిరర్థకవిషయ ప్రాసంగికులను, మొదలగు మహానుభావులు శ్రీ స్వాములవారి దర్శనమాత్రముననే నిశ్చేష్టితులై యూరు మాటాడనేరక శ్రీ స్వాములవారి యసమాన ప్రజ్ఞాపాండిత్యములకును, నిరుపమాన రూపలావణ్యాది యంగసౌష్టవమునకును, మిక్కిలి యాశ్చర్యపడసాగిరి సంఘ సంస్కరణులమని పేరుపెట్టుకొని హిందూమతోద్ధరణమునకై పాటుపడువారిని వెక్కిరించుచు పట్టణమునందంతటను సంచరించు దేశాభిమానులు కూడ శ్రీస్వాములవారి సముఖమున నోరెత్తనేరక వారి యభిప్రాయానుసారముగనే ప్రవర్తించుచువచ్చిరి

(సశేషము)

అంతఃపురోపన్యాసము.

ఏమినాథా! నేటి సాయంకాలము మీముఖము వికసించియున్నదే! నిన్నటిరాత్రి వలె చిన్నవోయి యుండలేదు. అదేమిటి? ఈల వేయుచున్నారే? పండుకొనుటకు గదిలోనికి వచ్చినప్పుడా ఈలవేయుట? ఈప్రపంచములో మీవంటి యోగ్యులు లేరని నేనొకప్పు డనుకొంటిని. ఇప్పుడన్ననో, మీరు పెనుభూతమువలె నున్నారే?

• నిద్రించెదమనుచున్నారా?

లేదు నేను మిమ్మున నిద్రపోనియ్యను. మీతో మాటలాడుటకు నాకిప్పుడే మంచి సమయము నేను చెప్పఁబోవునది మీరు వినకతీరదు. దినమంతయు దయ్యము వలె పనిఁజేసి రాత్రి యొక్కమాటైనను మీతో ముచ్చటించఁగూడదు కాబోలు?

నేను తఱుచుగా మాటలాడుదానను కానని మీరెఱింగియేయున్నారు. నిశీథసమయమందైన నొక్కసారి మాటలాడకూడదా? ఆహా! ఏమిటింత!

మీ చొక్కాయి కొక బొత్తము పోయినప్పుడు పెంకు లెగిరిపోవునట్లు మీరు కేకలువేయవచ్చు కాబోలు?

మీరు కేకలువేసి మొట్లుపెట్టుకొనలేదనుచున్నారా?

అవును మీకు కోపమువచ్చినప్పుడు మీకీప్రపంచజ్ఞానమే యుండదు

మీ కెప్పుడు కోపము రాలేదనుచున్నారా? నిజముచెప్పండి రాలేదా? నేనెప్పుడాగ్రహమన్న నేమో యెరిగియుండకపోయినను ఇప్పుడైనను తెలిసికొనెదను. నేనిన్ని దినములనుండి మీతోఁ గాపురముచేయుచు నింతమాత్రమైన దెలిసికొనకపోవలెనా?

కోటుబొత్తము పోయినంతమాత్రమున నట్లు మీరు గింజుకొనవలెనా? మీ యదృష్టవశమున నావంటి భార్య దొరికినది కాని పూజారి వెంకమ్మవంటిది సంప్రాప్తమైనయెడల మీపాట్లు కనఁబడును. నాచేతులో నెప్పుడును మంచి సూదికాని దారము కాని లేదుకదా? మీతోను, మీపిల్లలతోను నేనెంత శ్రమపడుచున్నానో దేవుని కెరుక? నేనెంత శ్రమపడినను మెప్పులేదుకదా? కర్మముచాలక వెధవబొత్తము పోయినందు కింత యల్లరి పెట్టెదరా? బాజారునకుఁబోయి బొత్తము తిరిగి కుట్టించుకొనరాదా? కుట్లుకుట్టడమునకు నేను జంగముదానను కాను ఇంటిలో నొక గుండుసూదినైన నుంచుకొననప్పుడు కుట్టుకుట్లు కెక్కడ? ఈప్రపంచములో నావలె భర్తయొక్క బొత్తములు జాగ్రత పెట్టునది మరియొకతె లేదు. నేను ముఖ్యముగా మూడుసారులు చెప్పుచున్నాను మీరు వినినను వినకపోయిననుసరే నేను కాపురమునకురాక పూర్వము మీరు తొడుగుకొను చొక్కాయి లిప్పుడున్నవియుకు——

నేనాసంగతి చెప్పకూడదా? నేను చెప్పకమానను "పుట్టినబుద్ధి పుడకలతోఁ బోవలె" నని నట్లు మీకుపుట్టినగుణమెట్లుమానును? నేను నోరెత్తినపుడెల్ల మీరు మండిపడి నన్ను మాటలాడనివ్వరు నేను చెప్పఁబోవునది మీరు వినరు ఇది మగవాండ్రకుఁ బుట్టిన పాడుబుద్ధి. వారెన్నిదినములైనను "వడవడ' వాగవచ్చునట ఆడవాండ్రు నోటికి మూతవైచికొనవలెనట! ఆహా! ఏమి యీనీతులు

అహర్నిశము భార్య తన బొత్తములసంగతియే చూచుచుండవలెనట? ఏమి యభిప్రాయములు! రేయింబవళ్లు బొత్తముల ప్రశంసయే చేయవలసిన యవస్థ సంప్రాప్తమైనయెడల నేయాడుదియు వివాహమాడదు. నామాట నిశ్చయము లేనియెడల వారేమిచేయగలరు?

భార్య లెప్పుడును భర్తలవస్త్రములు, పాదరక్షలే కుట్టవలసివచ్చినపక్షమున,

వారికి భర్తలులేకుండుటయేమేలు?

నాకెందుకీసంత? కానున్నది కాకమానదు మీబొత్త మూడిపోలేదని నేను నిశ్చయముగా చెప్పగలను నాకు పని కల్పించుటకు మీరాబొత్తము నూడలాగినారు లేనియెడల బొత్తము పోవుటకు వీలులేదు మగని చొక్కాయిలకు బొత్తములు కుట్ట వలసిన దురవస్థ నాకొక్క దానికి తప్ప మరెవ్వరికినిలేదు. నిశ్చయము

కానివ్వండి ఈ వ్యవహారము చిరకాలము జరుగునదికాదు మీరు పెట్టు కోతలకు నేనిదివరకే సగమైనాను. మీకష్టములు త్వరలోనే గట్టెక్కగలవు హా! మీరు నవ్వవచ్చును! మీరు సంతోషించెదరు అందుకేమియు సందేహములేదు ఆహా! ఏమి మీ ప్రేమాతిశయము? మీగుండియకన్న నల్లరాయి మైనను కొంచెము మెత్తగా నుండును. నాకు దినములు సమీపించినవి నేను వెళ్లిపోవుట నిశ్చయము. నేను పోయినవెనుక మీవొత్తములు మీ ద్వితీయభార్య యెట్లు జాగ్రతపెట్టునో చూదము మీకప్పుడుకాని బుద్ధిరాదు అపుడు మీకప్పుడు నాసంగతి జ్ఞప్తికివచ్చును సందియము లేదు. ఎందుచేతనో నేను వేఱుగ చెప్పనక్కరలేదు మీచొక్కాయి కప్పుడొక్క బొత్తమయిన నుండదు

నేను రాకాసినికాను మీరుతప్ప నన్నెవ్వరీప్రకార మనలేదు ఏమను చున్నారు? నాసంగతి మీకుతప్ప మరెవ్వరికిని తెలియదనుచున్నారా?

దానితో నేమియుసంబంధములేదు? హా! మీరు నాకు మేరుపర్వతము నిచ్చినను నేను మీతో కాపురము చేయలేను నేనుకూడ మీవంటి కోపధారిని కావలసినది ఈకొంపపాట్లప్పుడు తెలుసును. మీగుణమునకు దగినభార్య యుండవలసినది నాకును దానికిని గల తారతమ్య మప్పుడు వెల్లడియగును నేను ముద్దులాగున మాటలాడను గనుక మీరు నామీద సవారీచేయుచున్నారు. ఇకముందు నేనుకూడ జాగ్రతపడ వలసినదే మిమ్మునజూచి పిల్లలుకూడ చెడిపోవుదురని నేను భయపడుచున్నాను తెల్లవారినదిమొదలు పదిగంటలవరకు బొత్తములసోదియేకదా! నేడు కార్తీక సోమవారము! గోదావరిస్నానములేదు గుడిలోనికింబోవుటలేదు! సంధ్యావందన మదివరకే సన్నగించినది. పిల్లవాండ్రను మిమ్మునగూర్చి యేమనుకొనెదరో! ఈయల్ల రంతయు వెధవబొత్తమునుగురించియేకదా? పెద్దమనుష్యు లెవ్వరు నిట్టి నీచవిషయ ములనుగూర్చి ప్రశంసింపరు.

నన్ను నోరుమూసికొనమనుచున్నారా? నేను మూసికొనను ఎందుచేతనా? అందుచేతనే! చిల్లిగవ్వయైనను విలువలేని వెధవబొత్తముకొరకు మీరు నన్ను పలు బాధల బెట్టుచున్నప్పుడు నేను నోరెత్తకూడదా? అయ్యో! ఏమి నా ప్రారబ్ధము!

మీరు మగవారుగనుకనా, నాకీపాట్లు? హా! దైవమా! ఇప్పుడు నాకొక యుపాయము తోచుచున్నది మీబొత్తములన్నియు నూడిపోవును. నేను వానికొక దారమైనను గ్రుచ్చను బొత్తములన్నియుఁ బోయినవెనుక మీరేమిచేయుదురో చూచెదను

బొత్తములు కుట్టుటకు మరియొకరు వచ్చెదరా? ఆహా! ఏమి యీబెదరింపులు! పరమశాంతస్వభావులైన నావంటిభార్య నిట్లు బెదరింపవచ్చునా? మరియొకరు వచ్చెదరా? నాకంఠములో ప్రాణమున్నంతవరకు నంతపని జరుగదు నేను చనిపోయిన వెనుక నాకెప్పుడీశ్రమ నివారణ కాగలదో తెలియకున్నది — నేను గతించిన తరువాత— ఏమి ఆ గుఱ్ఱు! పందివలె మూలుగుచున్నారే?

మీరు మూలుగుచుండుటలేదా?

అవును! మీరాప్రకారము చెప్పుట సహజమే! అయితే నాకేమి! మీ బొత్తములు కుట్టుటకు మరియొకరిని తెచ్చుకొనవచ్చును హా! మీ రట్టిపనిజేసినను నేనాశ్చర్యపడను మీరిప్పుడేమిచేసినను సరే? మీవ్యవహార మిట్టిదశకు వచ్చునని జనులందరిదివరకే యనుకొనుచున్నారు? ఈ బొత్తముల వ్యవహారముతో నేనుకూడ కండ్లు తెఱచితిని! మీక్రౌర్యమంతయు ప్రపంచమునకు వెల్లడికాగలదు. నావంటి యోగ్యురాలి కెన్నిపాట్లు వచ్చినవి! దానికడుపు కాల, అదెక్కడ సంప్రాప్తమైనది? బొత్తములుకుట్టుట కది సిద్ధముగును కాబోలు! నాథా! ఇది మీకు న్యాయముకాదు నన్నీప్రకారము వంచింపజూచుట మీకు తగునా? మీరెన్నిలోపములుఁ జేసినను నేను నోరుమూసికొని సగము చచ్చినదానివలె సంచరించుచున్నాను నాయిటికి నాకు స్వతంత్రములేదా? అయ్యో! నేనెంత మందభాగ్యురాలను! నేను మీవలె కఠినహృదయురాలనుగాను పకిమాలిన బొత్తమునకై మీరు నన్నిట్లు వేధించుచున్నారు. లెడ్లవంటి కఱ్ఱలతో మీరు ప్రతిదినము తోలుబంతు లెగరవేయుటెందుకు? క్రిందను మీదను పడి కాళ్లు విరుగగొట్టుకొనుటెందుకు? పరుగెత్తునప్పుడు కోట్లబొత్తములు పారవైచుకొనుటెందుకు? బొత్తములూడిపోయినందుకు నాపై దండెత్తుటెందుకు? అయ్యో? నాకిట్టి దురవస్థ సంప్రాప్తమగునని కలలోనైన నెరుగను! పైపెచ్చు రంకుముండలనిండ్లకు తీసుకొనివచ్చుటకూడ తటస్థించును కాబోలు మీపిల్లలను మీబొత్తమును మీరు జాగ్రతచేసికొనవచ్చును నేనిక మీతో కాపురముచేయలేను. నేను పోయినవెనుక మీరు స్వేచ్ఛగా తిరుగవచ్చును. శీఘ్రకాలములోనే మీకోరిక లీడేరగలవు

హా! దైవమా! నన్నీపాడుజన్మమెందు కెత్తించితివి. ఈ- బొ- త్త—

ఈప్రకార ముపన్యసించుచు భార్య నిద్రవోయి తన మగని కయిదువందల రూప్యముల జీతముగల యుద్యోగమైనట్టు కలగనెనట ఆహా! ఏమి దైవమాయ!

విజ— నేను చాల వ్యాకులపడుచున్నాను. వెదకితే అతనియొద్ద మంచిగుణము లేశము గనఁబడకున్నది.

కుబే— లేదత్తా! మంచిగుణము లేశమును లేదు. అంతా కృత్రిమమే! తానేగడాసు వాఁడ ననుకొన్నాఁడు. నాకేమాత్రమును తెలియదనుకొన్నాఁడు. అసలు నేను దేశాలన్ని జయించినవాఁడను. నాకు సర్వోపచారములు చేయనియెడల నావల్ల తనకేమీ దక్కదనుకొని యింతపని చేసినాఁడు. కనుక, ఇప్పుడు వానికేమీ దక్కనియ్యను.

చండ— (ప్రక్కమొగముగా) ఎట్లయినను వానోట మన్నుపడ్డట్లే! (పయికి) శాంతించు! అల్లుఁడా! శాంతించు. ఈలాగు తొందరపడితివా నీకు దేహములో జబ్బుచేయఁగలదు. నాకు నీకోసము బెంగగానున్నది.

కుబే— అత్తా! నీకు నామీఁద పరమవాత్సల్యముగదా! (కూరుచున్నాఁడు.)

చండ— (ఎడమువైపునఁ గూర్చుచున్నది)

కుబే— అత్తా! దైవసాక్షిగాఁ జెప్పుచున్నాను. నీకు నాపట్లఁగల నిర్హేతుక జాయమాన కటాక్షముచూచి నాహృదయము కఱఁగిపోవుచున్నది. ఈవఱకు నాతోఁ జేరిన బంధువులందఱు 'నీయింటికివచ్చినా నాకేమిచ్చెదవు' మాయింటికి వచ్చితివా నాకేమితెచ్చెదవు. అనే దుర్మార్గులే? (పొడుము పీల్చుట నభినయించును)

చండ— నాభాగ్యమును, ఆలాగటిదే. నాకు కడుపునఁబుట్టిన పిల్ల యొక్కర్తున్నది. ఇఁక కొడుకులు లేరు. కొమ్మలు లేరుగదా! నాజీవము 'హరీ' అన్నతరువాత నాయాస్తి అంతా తమకే వచ్చునుగదా! అయినప్పటికీ, ఆపిల్ల దానినెవరి చేతిలోఁ బెట్టుదామనిచూచినా నాసర్వస్వమూ ఇప్పుడే వ్రాసియిమ్మని కోరే చండాలులే! ప్రపంచమందు అందఱు తమ కార్యము తమ కారోగ్యము కోరువారే! మోసకృత్యములేనివాఁడొక్కఁడయినా కనుపడఁడోయి నాయన!

కుబే— నిజముగా! మీపిల్లదానికేవయినా సంబంధాలీవఱకు వచ్చినవా?

చండ— కావలసినన్ని—

కుబే— అయితే మఱి యింతకాలము పెండ్లిచేయకూరకున్నావేమి?

చండ— నిజముచెప్పుదును. విందువా?

కుబే— వినవలెననియే అడుగుచున్నాను.

చండ— నా పెద్దకూఁతున్ను రెండవకూతును కూకటులు గొలిచి చిన్నపిల్లలకు, ప్రథమవరులకు కాళ్లుగడిగి కన్యాధారపోసి పెండ్లిచేసినాను. ఆబిడ్డలిద్దఱును భంగపెట్టినారు. (పైఁటకొంగుతో కన్నులు తుడుచుకొనుచున్నది.)

కుబే— ఊఁ అడిల్లు అత్తా! ఊఁ అడిల్లు. నీమనస్సు వెన్నకంటెను మృదువయినదిగాఁ దోఁచుచున్నది.

చండ— ఇఁక చెదిరి బ్రతికిన యీపిల్లయొక్కటెయున్నది. దానిని నీవు చూచినావుగదా! అది జమీదారులయింటఁ బుట్టవలసినపిల్ల. దీనిని పడుచువానికిని ప్రథమవరునికిని పెండ్లిచెయ్యనని శపథముచేసినాను ఆనుమాయము తప్పించియే రెండవపెండ్లివానికయినా యిచ్చితినా దానికడుపున నాలుగుకాయలుకాచి ముందరకు వంతుకు రాఁగలదన్న నమ్మకముతో ఇంతవఱకు ఎవ్వరికి మాట యియ్యలేదు.

కుబే— ఈవఱకడిగినవారిలో భాగ్యవంతు లెవరైన నున్నారా?

చండ— అందఱు లక్షాధికారులే!

కుబే—(ప్రక్కమొగముగా)అయినరొండల, యీబిడ సొమ్ముకొఱకు నపేక్షపడునది గాదు. (పయికి) ఎంత నిక్కపటురాలవమ్మా? ద్వితీయవరుఁడే కావలెనా? ఈవఱకు ఎక్కువవివాహాలాడినవాఁడు పనికివచ్చునా?

చండ— ప్రథమవరుఁడు కాకపోతేసరి. అతని కిటుక్రిత మెన్ని పెండ్లిండ్లయినా నాకు విచారములేదు.

కుబే— (ప్రక్కమొగముగా) మన మీవఱకయిదుగురను పెండ్లాడినను అయిదుగురును గతించి ముప్పవేళ కెవ్వతెయు లేకుండాపోయినది. ఈమెకూఁతురు మనకు దొరికెనా, పిల్లమాఁట యటుండఁగా, తల్లివల్లనే మనకు సకలోపచారములు జరిగి ముప్పుగడచును. (పయికి) నీఅల్లునకు వయస్సెంతయుండవలెను.

చండ—పడుచువాఁడు గాకపోతేసరి! ఎంతవయస్సయితేనేమి? మాఅప్పకూఁతును అఱువదియేండ్లవానికి పెండ్లిచేసినారు. ఇప్పటికి ముప్పదిసంవత్సరములయినది. దోసతోటలాగున అది కడిపెడు బిడ్డలఁగన్నది. వయస్సెంతయితేనేమినాయనా? నీకంటె ముసలివాఁడు గాకుంటేచాలును.

కుబే— (ప్రక్కమొగముగా) మనకీసంబంధము సిద్ధించునట్లేయున్నది. (పయికి) మీపిల్లదాని కలంకారము లేమికావలెను.

చండ— (ప్రక్కమొగముగా) త్రోవలోఁబడుచున్నాఁడు. (పయికి) వారియిష్టమే కాని నాకేయలంకారములమీఁదను కోరికలేదు.

కుబే— (ప్రక్కమొగముగా) ఇంత తెలివితేటలుగలది స్త్రీజాతిలోలేదు. మఱి నీకోరికేమి?

చండ— నాకోరిక, నాఅల్లుఁడు, కూఁతురు సర్వదా నన్ను గనిపెట్టుకొని యుండ

వలసినదితప్ప ఇంకేమియు లేదు. నాకేమి కావలెను.

కుబే— అట్టియల్లుఁడు దొరికెనా నీపిల్లనిచ్చుటకు సిద్ధముగానున్నావా?

చండ—(ప్రక్క మొగముగా) మనయుక్తి యుపయోగింపవలసిన సమయము వచ్చినది. (పయికి) అయితే, యొకమాట! వెనుకటి యల్లుండ్రిద్దఱు నాయింట నుండు ముంటుమని చెప్పి మళ్లి మొగమయినా చూపరైరి. పోనీ! వాండ్రంతట వాండ్రు సుఖపడుదురని నమ్మితిని. కాని వంచకులయిన బంధువులవల్ల ఆస్తి కోల్పోయి దరిద్రులయినారు. అందుచేతనే నొక శపథము చేసినాను. ఎవరయితే యీపిల్లను పెండ్లాడఁగోరుదురో వారిసొమ్మంతా ముందుగా నా యధీనము చేసికోకుండా పిల్లదాని నియ్యఁగూడదని— ఆపద్ధతికి లోఁబడే పెండ్లికొడుకు దొరికిన యెడల, ఇప్పుడు ఈక్షణమందు సంబంధ నిశ్చయము చేసికొనవచ్చును.

కుబే — (ప్రక్క మొగముగా) ఇంత దొడ్డయిల్లాలిచేతికి మన యాస్తి యిచ్చిన మాత్రమేమిభయము? ఈమోసగాండ్రకు స్వాధీనపడకుండా మఱింతజాగ్రత్తగా నుండును. కాని, తీరా, పెండ్లాడితిమా, వెనుకటిభార్యలవలెనే, నీదగ్గఱ 'పొడుము వాసన' యని యెన్నఁడును ప్రక్కకు రాదేమో? అయినా ముందుకూడఁ జూతము. (పయికి) అత్తా! నీ సర్వమయిన కోరికలును నాచేతఁ దీరఁగలవు. నీకు సరిపడ్డవాఁడను నేనే! నాకు చక్కని దారి చూపినావు. నాయిష్టార్థము లన్నియు ఈడేరునట్లు కనఁబడు—

చండ—(మాటకడ్డము వచ్చి) కుబేరసేనా! నీమాటలు వినఁగా నాకు పరమాశ్చర్యము కలిగినది. నేను నిన్నుద్దేశింపలే—

కుబే— (మాటకడ్డము వచ్చి) నన్నుద్దేశింపనిమాట నిజ—

చండ — పిల్లదాని నెవరికిఁ బెండ్లిచేయఁదలఁచినావని నీవడుగఁబట్టి నాయభి ప్రాయము చెప్పినానుగాని నీవు పెండ్లాడవలసినదని నాకోరిక గా—

కుబే— (మాటకడ్డము వచ్చి) నీకోరిక గానిమాట సత్యమే! (ఊరకున్నాఁడు).

చండ — (ప్రక్క మొగముగా) 'అది నీకోరిక గాదు గాని నాకోరిక' అని చెప్పక మొద్దులాగున మాటాడక కూరకున్నాఁడేమి! అయ్యో దీనినాలుక పడిపోను!

కుబే— (ప్రక్క మొగముగా) ఈవిడ లజ్జావతియు, వినయవతియు, అయిన యుత్తమ కులాంగన గనుక సిగ్గుపడ్డది నాయభిప్రాయము వెంటనే ప్రత్యక్షముగా చెప్పి వేయుట నాదే తెలివితక్కువ. కానీ! ఇఁక భావగర్భముగా మాటాడి యీమె నొడఁబఱిచెదను. (పయికి) అత్తా! నేఁ జెప్పఁబోవుమాటలు విని నాకుత్తరమిమ్ము. స్త్రీజాతిలో నీవంటి వివేకశాలినిని నేనీవఱకుఁ జూడలేదు. ఇట్లు చెప్పునియెడ

ప్రమాణముచేసి చెప్పఁగలను. కాఁబట్టి నీవు ప్రత్యుత్తరమియ్యకపోతివా నాకట్లె నీకు దయ తక్కువనియే యెంచుకొందునుగాని, ఆలోచన తక్కువని యెంచను. తరువాత నీయిష్టము.

చండ— (ప్రక్కమొగముగా) తిరిగి మనవలలోఁ బడఁబోవుచున్నాఁడు. (పయికి) నాయనా! నీవింత నిర్బంధించుచున్నావుగనుక ప్రత్యుత్తరమిచ్చుచున్నాను ఆఁడుదాననుగదా? తెలివితక్కువ లేమయిన నాకుంటెనా మన్నించు.

కుబే— (ప్రక్కమొగముగా) మన యుక్తి, చమత్కారములన్నియు ఉపయోగించుటకు సమయమిది! (పయికి) ఒక సాంప్రదాయసిద్ధుఁడయిన వరుఁడు, విదేశములలో పనిచేసి, విస్తారద్రవ్య మార్జించుకొని వచ్చినాఁడు. అతనికి నీబిడ్డ నిచ్చుట కాక్షేపమేమైన నున్నదా?

చండ— అతఁడు ముందుగా జరుపవలసిన విధులను శేఁషయిని వివరించియే యున్నాను. వానికి లోఁబడి, నాపిల్లను జేసికొనుట కంగీకరించి ఆవిధులను ముందుగా జరిపినయెడల విశేషోత్సాహముతో నాబిడ్డనతనిచేతిలోఁ బెట్టి దేవతలు మెచ్చునట్లుగా వివాహముచేసి నా యావజ్జీవము దాసినయి సర్వోపచారములు చేయుదును.

కుబే— (ప్రక్కమొగముగా) ఇఁక మనము స్వర్గము చూఱగొన్నట్లే (పయికి) ఆవరుఁడు కల్లుమందువాఁడయినయెడల నీకేమయిన నాక్షేపమున్నదా?)

చండ— నామట్టుకు నేనే కల్లుమందు లేకుండ బ్రతుకలేను.

కుబే— ఎంత యదృష్టము! దానికేమిగాని, ఆవరుఁడు తప్పు పొడుముపీల్చకుండా నిలువలేఁడు! ఎంతచేతనయితేనేమి, పొడుము నసహ్యించుకొనే పిల్లనిఁక పెండ్లాడనని యతఁడొట్టుపెట్టుకొన్నాఁడు. పొడుముపీలిచే మగనినిజూచెనా నీపిల్ల కిష్టమేనా? (పొడుముపీల్చుట నభినయించును)

చండ— (ప్రక్కమొగముగా) ఆవరుఁడు తప్పు పొడుముపీల్చకుండా నిలువలేఁడు! నేను పొడుమువాసన తగిలితే బ్రతుకలేను. కాని, పొడుము పనికిరాదనిచెప్పి చేతికి దొరికిన భాగ్యమంతా పోగొట్టుకొనుటకంటె తెలివితక్కువలేదు. కాఁబట్టి ఇట్లనియెదను. (పయికి) పొడుమనఁగా రాజపూజితమయినవస్తువు. పండితులందఱకు కావలసినవస్తువు. నీవు దేహసంబంధుఁడవుగనుకను. నేను కాలము చెల్లినదానను గనుకను సిగ్గువిడిచి నీతో చెప్పుచున్నాను. నామట్టుకు నేను పొడుము లేకుండా బ్రతుకలేను. నాకు మాపిల్లదియే పొడుము చేసియిచ్చును. పొడుముపీల్చేతల్లి యిష్టమయినప్పుడు పొడుముపీల్చే మగఁడిష్టము కాఁడటోయి?

కుబే— ఎంత సంతోషకరమయినమాట చెప్పినావు. ఈమాటతో నాశరీరమంతా ఉబ్బిపోవుచున్నది! నీకు పొడుమభ్యాసమన్నమాట యీవఱకును నాకుఁ దెలియకుండ కప్పిపుచ్చితివి! నామట్టుకు నేను, బ్రహ్మదేవుఁడు ఎదుటనున్నను సరే! గడియకు అథమము నాలుగుమార్లయిన పొడుము పీల్చకుండా నిలువలేను. ఎంత మర్యాదగల యుత్తమురాలవు! ఈసంగతిని నాయంతట నేను కనిపెట్ట లేనందుకు నేనెంత బుద్ధిహీనుఁడను! నాయందలి గౌరవముచేత నీవెంత యిబ్బంది పడి నాయెదుట పొడుము వేయుట మానుకొన్నావో? నేను పరుఁడననుకొన్నావా? పీలుచు, పీలుచు, మానితివా నాతోడే సరి (అని కాయ చేతికందిచ్చుచున్నాఁడు)

చండ — (ప్రక్కమొగముగా) ఓహో! కంఠముమీదికి తెచ్చుకొన్నానుగదా! అక్కఱ లేదంటినా యితఁడు విడువఁడు అభ్యాసము లేదంటినా యీవఱకన్న మాట యబద్ధమయి పన్నిన యెత్తంతా చెడును (కాయనుండి పొడుము రాల్చుచున్నది)

కుబే— బాగా వేసికో! బాగా! బాగా! చాలసేపటినుండి యిబ్బందిపడుచున్నావు.

చండ— (పొడుము పట్టుపట్టి ముక్కు దగ్గఱఁ బెట్టుకొనుచున్నది.)

కుబే— సిగ్గువిడిచిపెట్టి బాగా పీల్చకుంటివా కానియెట్టు పెట్టెదను.

చండ — (పీల్చుట నభినయించుచున్నది. అక్షు. అక్షు. అక్షు అక్షు అక్షు అక్షు. అక్షు. అక్షు అని విరామము లేకుండ తుమ్ముచున్నది

సేవకుఁడు— (తెర జిమ్ముకొని పరుగెత్తుకొని కుబేరసేనుఁడున్న తావునకు వచ్చుచున్నాఁడు)

విజ- విమ- సుమంత్రుఁడు— ప్రక్కగుమ్మముకడకు వచ్చుచున్నారు.

చండ— (మఱియు తుమ్ముచున్నది.)

కుబే— (సేవకునితో) ఓరి గాడిదకొడుకా! పొడుములో సున్నమెక్కువ యేమిటికో వేసినావురా? ఆయిల్లాలు నావలెనే తనకును పొడు మభ్యాసమని చెప్పినది. సున్నమెక్కువ కాకుంటే యిన్ని తుమ్ములురావు మంచిపొడుము తీసికొనిరా! (అని కాయచేతికిచ్చుచున్నాఁడు)

సేవ— (తీసికొని వెళ్లుచుండఁగా)

సుమం — (విమలావిజయసేనులతో) ఈ ముసలివానిని లోఁబఱచుకొనుటకయి తనకు పొడుముకూడ నభ్యాసమని చెప్పినది! ఎంతకయినా తగినదండీ! ఈ పొడుము మనమును చూతము. సైగ చేఁ—

విజ—(సేవకుని బిలిచి, పొడుము కొంచెము చేతిలో వేసికొని యాఘ్రాణించుటను

నటించి, తమ్మఁబోయి ముక్కు గట్టిగాఁ బట్టుకొని సుమంత్రుని పిల్చుమని సైగఁ జేయుచున్నాఁడు.)

సుమం— (విజయసేనునివలెనే నటించి యెడమచేత ముక్కుఁ బట్టుకొనుచున్నాఁడు.) స్త్రీజాతికి చండసేన దారిచూపినది. (అని పొడుముపట్టు విమల ముక్కునొద్దఁ బెట్టుచున్నాఁడు.)

విమల — (తుమ్ముఁబోయి చేత ముక్కు బిగించుకొనుచున్నది.)

చండ— (మరల తుమ్ముచున్నది. లేచుచున్నది)

కుబేర— నేనెంత నర్వాగ్గము చేసినాను. ఓర్చుకో! అత్తా! ఓర్చుకో!

చండ— ఇదియేమి నాతల తిరుగుచున్నది. నేను పడిపోవుచున్నాను.

కుబేర— ఓహో! ముసలివాఁడను. ఈమెను పడకుండఁ బట్టుకొనలేనుగదా! (అని నడుముపట్టుకొనుచున్నాఁడు.)

చండ— నాతల తిరుగుచున్నది. క్రిందఁ బడఁద్రోయునట్లున్నది.

కుబేర— పడకు! పడకు! నీతో నేనుకూడ పడుదును.

విజయ— (తొందరతో ప్రవేశించి) భయము లేదు. భయము లేదు.

కుబే— ఈలాగురా! నాకు శక్యము గాకున్నది. ఈమె పడకుండ సహాయము చేయుము.

చండ— (తెప్పిఱిల్లి) నేను కొంచె నూవలకు వెళ్లుదును. నాకతనిసహాయ మక్కఱ లేదు. నాకుఁ గావలసినది నీసహాయమే!

విజ— నా తాత్పర్యమును అదే! (నవ్వుచున్నాఁడు.)

విమ- సుమం— (ప్రక్కకు వెళ్లి నవ్వుచున్నారు)

చండ— విజయసేనా! నీవు మోఁటుమొద్దువు. సుమంత్రుఁడా! ఎంతసరసుఁడవు నీవు! విమలా! నీప్రవర్తనము చూడఁగా నాకు సిగ్గగుచున్నది. (కుబేరసేనుఁడు పట్టుకొనియుండఁగా గుమ్మమునొద్దకు వెళ్ళి) అల్లుడా! మన మనుకొన్నమాటలన్ని నీయాంతర్యమునందే యుంచు. (వెళ్లుచున్నది.)

విజ- విమ- సుమం— (మరల నవ్వుచున్నారు.)

కుబే— విజయసేనుఁడా! చాల సంతోషించినాను. విమలా! నీవు చాల చక్కని పిల్లవని యిప్పుడు తెలిసినది నాయిష్టురాలయిన యిల్లాలికి మీరు గనుపఱచే భక్తి ప్రపత్తు లిట్టివేగదా!

విమ— చిననాయనా! క్షమించుము. క్షమించు! నవ్వినందుకు కోపింపకుము ఆమె పొడుము పీల్చుట నీకిష్టమని నాకుఁ దెలిసినది గాదు. (తుమ్ముచున్నది.)

కుచే— తెలియకపోవచ్చును. ఆ దుశ్చేతనే కాఁబోలు నీవుగూడ తుమ్ము పెక్కిరించుచున్నావు.

సుమం— ఆమె తుమ్ముటకు హేతువదిగా— (తాను తుమ్ముచున్నాఁడు.)

కుచే— నీతో నాకు చిరకాలపరిచయము లేదు. ఇఁకనక్కఱయును లేదు. ఆయక్కఱ విమలకే!

విజ— చిననాయనా! నిన్ను నొప్పించుటకు స్వప్నమందయినా మేము తలఁపలేదు. చండసేననుజూచి నవ్వినమాట నిజము.

కుచే— మీరామెనుజూచి నవ్విరిరా నన్నుఁజూచి నవ్వినట్లే!

విజ— అయితే మేమామెనుజూచి యిఁక నవ్వము. సర్వథా నీ యిష్టానుసార నడతుము.

కుచే— ఇఁకఁ దెలిసినది. తిరిగి దైన్యవృత్తికిఁ బాలుపడ్డావు.

విజ— ఏమీ? దైన్యవృత్తియా?

కుచే— అవును. దైన్యవృత్తి నాపట్ల నీయతివినయమునకు హేతువేమో నేనెఱుఁగననుకొన్నావు! నాసొమ్ముపై నాశయే!

విజ— నాకు నీసొమ్ము గావలెనా? అది నాకు గడ్డిపరకపాటిది.

విమ— అన్నయ్యా! తొందరపడకు.

కుచే— (విమలతో) అవును. అది సత్యము. నీఅన్నను నెమ్మదిపఱచి ధ- డయిన మీ చిననాయనను అలక్ష్యము చేయవలదని చెప్పు— కాని, — కార్యము లేదు. మీ మాయోపాయములన్నియు నాకుఁ దెలిసినవి.

విజ— మాయోపాయములనఁగా నీ యభిప్రాయమేమి? ఇట్లనుటకీసాహసమెవని?

కుచే— (మాటకడ్డువచ్చి) నీకు కోరికయయ్యెనా, నీయిష్టమువచ్చినంత కోపము దెచ్చుకోవచ్చును. కాని, సంగతియంతా నాకుఁ దెలిసినది. నీవు దూరదృష్టి దూరశ్రవణములులేక చేసిన యీసాహసవ్యాపారములో నీసొమ్మంతా గంపాలయినదిగదా!

— అయితే నీకేమి?

... కాని, అంతలో ...

విజ— నీవు మిక్కిలి కృతఘ్నుఁడవు నన్ను నిష్కారణముగా నొప్పించుచున్నావు.

కు. చే— నీ యిష్టానుసారము దూషింపు. నీ కేమియు నపాయము లేదు — నేను ముసలివాఁడను.

విమ.— చిననాయనా! ఈ ప్రపంచమంతా యిచ్చినను, అన్నయ్యా నిన్ను దూషింపఁడు నీవే మొదట మిగుల తొందరపడినావు.

కు. చే— ఓ బుద్ధిమంతురాలా! నీయన్నగారి మోటుతనముతో నీవును సర్వథా, ఏకీభవింపుము

౧౦— ఈ చెడుగున కంతకు కారకురాలా దుర్మార్గపు ముసలియవ్వ. ఇందుకు నాది సందేహము—

౯— నీవు నీతిమాలిన పడుచువాఁడవు. నా పట్ల మీ దుస్తంత్రములన్నిటిని గనిపెట్టి నాకు దారిచూపి నన్ను జాగ్రత్తకుఁ దెచ్చినది నిశ్చయముగా నా యుత్తమాంగ గనయే! ఈ మహోపకారమునకుఁ బ్రత్యుపకారమామెకు నే నెట్లు చేయఁ గలనో నాకుఁ దెలియకున్నది.

— కాని, ఆమెకుఁ దెలియును.

— సరే! నేనీదినము నాగదినుండి యీవలికి రాను. రేపు నీయింటనుండను. (దవైపునకు వెళ్లుచున్నాఁడు.)

(అతని కెదురుగా వచ్చి) కాని, తమ పెద్దపులిని, ఆ కాలసర్పములను గూడ తమతో వెంటఁబెట్టుకొని వెళ్లుటకు నా ప్రార్థనము.

కు. చే— (అతని పయిని చేత్తము జళిపించుచు) ఛీ! అయోగ్యుఁడా!

ష్ణా— అట్లు సెలవియ్యకండి! ఇక్కడ తమ యధికారము సాగదు.

చే— దారిలోనుండి లే!

ష్ణా— అందుకు నాకభ్యంతరము లేదు.

చే— ఛీ! ఈ నెళ్ళ ప్రట్టి! (వెళ్లుచున్నాఁడు.)

! నేను మా చిననాయనయ్యా, ఏమనుకొన్నను సరే కాని, నీవు మాత్రము తప్పిన దసుచుట న్యాయము గాదు.

న్న —

జస్వం— స్నేహితులారా, మనమిచ్చటజేరిన దెందునిమిత్తమో మీరెఱుఁగుదురు. మన స్వామియైన మల్హారురావుగారు చనిపోవుటయు వానికి సుకుమారులను మనుమలును లేకపోవుటయును మన కింతటివిచారమును భ్రమయును గలిగించినవి. అటయుండ, వంశనాశనమయ్యెనని విచారముగలిగి మన రాణిగారికిఁ బుత్రస్వీకారము జేయవలెనని నేను బ్రయత్నముచేయుచుండ మన రాణి— రాణియనుటకు నోరాడ లేదు— యహల్యాబాయి మనపై నధికారము జేయవలెనని పెంచుకొన్ననని, స్పష్టముగ జెప్పినది అదిగాక నన్నద్భుతమైనమాటలాడినది.

గౌమో— ఆహాహా! యెంత దుష్కార్యము, ఆడుది రాజ్యముజేయుటగూడ వచ్చినది

దౌల— ఆమెకు మామగారిచావు, కత్తిగుంటచావు పండుగనైనది యెంత కఠినురాలుగాకున్నయెడ కుమారుఁడు కడతేఱఁగ మూఁడుమాసములుకాలేదు, యింతలోనె రాజ్యమేలఁదలంచునా?

జస్వం— కొడుకుచచ్చెనని విచారముగాని, ప్రజలు తన్నేమందురో యను లజ్జగాని యామెను బాధించుటలేదు రాజ్యకాంక్ష దుఃఖమును, లజ్జనుగూడ మఱపించునుగదా?

దుండి— కర్తవ్యాంశమును వేగమె వితర్కించుటమంచిది

జస్వం—ఇపుడు నేఁ జెప్పఁదలఁచినదేమన్న మనమందఱము పరువుగల మహారాష్ట్రులము శివాజీకాలమునుండియు నా వారు ప్రాణములకంటె మాన మెక్కువగ నెంచినమాట నేను వర్ణింపనక్కఱలేదు. యింతంత బలవంతులమై యింతంత బుద్ధిమంతులమై కటకటా! తుదకు పనికిమాలిన యాఁడుదానిచేతఁ బరిపాలింపఁబడవలసినంతటి దురదృష్టవంతులమైతిమి. ఈ యాఁడుదాని ప్రభుత్వమున మనకున్న గౌరవము నిలుచునా! వీరిమెచే నేలఁబడుట కిచ్చగలవారా! మీకు మీసములేదా? మగలు కారా? మహారాష్ట్రులకు బుట్టలేదా? మీరు మహారాష్ట్రులగుదురేని యామెను రాజ్యవిహీనురాలుగఁజేసి ప్రతివిషయమున నామె యత్నమునకు విఘ్నము గావింపుడు. ఇది మీకు సమ్మతమేనా?

దౌల— సమ్మతమాయని యడుగుచున్నావా? ఆడుదాని పాలనలోన రెండు మూఁడు నెలలున్నందుకే సిగ్గుపడి తల పొట్టలోఁ బెట్టుకొనుచున్నాము నీవెట్లు చెప్పిన నట్లే చేసెదను ఈమె ప్రయత్నము భంగముఁజేయుటకు దేశమునన్నున్న భిల్లులను సహాయము జేసికొని మనము దేశముఁ గొల్లగొందము. అప్పుడామె లొంగును

జస్వం— ఆమె మీఁదఁ గోపముచే నిష్కారణముగ నిరపరాధులగు ప్రజలను

క్షోభపెట్టుట మంచిదిగాదు. మనమెంతకొట్టుకొన్నను, దేశమున కరిష్టము రాఁగూడదు. ప్రజలసుఖము చెడరాదు.

గోమో— నేనిదివఱకే దీనినిఁగూర్చి కొంచె మాలోచించినాను ఉదయపుర మహారాణావారికి వర్తమానమంపి మనదేశముపై దండెత్తుమని ప్రోత్సాహపెట్టి యతనికిఁ దగు సహాయముజేయుట యుక్తము భేతాళసింగుతో నేనిదివఱకామాటఁ దలపెట్టినాను

జస్వం— రాజపుత్రు లసాధ్యులు తీసుకొనివచ్చుటయెగాని మఱల వదల్చుకొనుట మన తాతతరము గాదు అందుచే వారిని బిలువవలదు. ఒకరిని బిలుచుటయే యుక్తమైన శ్రీ రఘునాథరావును రమ్మందము

దౌల— కొంచె మది బాగున్నది (అని దుండిరావుచెవిలో) ఈ జస్వంతరావు మెల్లగా రఘునాథరావును రప్పించి తన మనోరథసిద్ధికైఁ బ్రయత్నించుచున్నాడు. మనము భిల్లుల వదలగూడదు.

దుండి— అయ్యా, యింకొకసంగతి మన రహస్యముల నెఱుఁగుటకు రాధాకాంతుఁడును, వానితోనున్న శ్యామసుందరదత్తును, దమ తపస్సు ధారపోయుచున్నారఁట వారు మనలను బట్టుకొందురఁట జాగ్రత

దౌల— చెప్పుట మంచిది. ఆకుఱ్ఱవాఁడు శ్యామసుందరుఁడు తెగనీలుగుచున్నవాఁడఁట ఓయీ, గోమోజీ, యేదో వంకబెట్టి వానిని గడతేర్చెడు నుపాయము జూడుము నీవు కొత్వాలువుగదా నీవు చేయఁగలవు

గోమో— వాఁడక్కడక్కడ నన్నుఁగూర్చి ప్రేలుచున్నాడఁట. వానివిషయమై యేపనిచేయుమన్నను చేయుదును ఇఁక మన మరుగుదము లెండు.

జస్వం— మీరు నాపలుకుల కియ్యకొనిరిగనుక నేనామెతో ప్రత్యక్షకష్ట వహించెద. ఆమెదగ్గఱ నాకుద్యోగము వద్దనియు, గొడుకును బెంచుకొనకయున్న నామెకు మాకు సంబంధములేదనియు, నామెకు నేనుత్తరము వ్రాసెద.

గోమో— నామాట నీవందు వ్రాయకుము, నేనీకొత్వాలుపనిలోనుండియే నీకు సమస్తసహాయములు చేసెదను ముందుగా నుద్యోగము మానుటెందుకు?

జస్వం— ఇంతటిస్థైర్యమే నాకిది? ఓయీ దౌలతరావూ, నీవు మీయన్నభార్యను వివాహమాడెదవని విన్నాను. ఆపనిమాత్రమువద్దు అట్లయిన మనపైఁ బ్రజలకు నమ్మకముండదు.

దౌల— దానికేమిలే యెట్లో సాసాయించవచ్చును. అపుడే మైనదా, మన మందఱమిండ్లకుబోదము రండు అని యందఱును లేచి యుచితప్రకారమున నెలవుఁ

వైకొనిపోయిరి. సఖారాము దేవళములోని విగ్రహమువలెఁ గూర్చుండెనే కాని యొక మాటయు మాట్లాడలేదని జస్వంతరావు సందియమందెను కాని కారణమడుగఁడయ్యెను. అందఱు గృహము వెడలిరి గోమాజీరావు సఖారాముని వెంటబెట్టుకొని కొంత దవ్వరిగి యచ్చట నతనిచెవిలో మెల్లగా 'ఓయీ స్వలాభపరాయణులును, దురాత్ములునగు వీరిని నమ్ముకొని నాయుద్యోగము మానుకొందునా? యెటువచ్చి యెటు వచ్చునో, దౌలతరావు జస్వంతరావులు తమతమ మనోరథముల నెరవేర్పఁదలఁచి యీయెత్తులెత్తిరి అవి నేనెఱుఁగనా ఏమైనను రాణావారిని వచ్చి నింబపురమును వైకొమ్మని చెప్పుము ఇంక నీవరుగుము" అని నొక్కి పలికి వానినంపి తాను స్వగృహమున కరిగెను.

ఎనిమిదవ ప్రకరణము.

"నేను మీ ముఖ్యమంత్రులలోనివాఁడనని మీరెంచుకొనుటలేదు. అట్లు మీరెంచుకొనినపక్షమున నాయాలాపమునకు మీరు చెవియొగ్గియుందురు. పుత్రస్వీకారము చేసికొని ప్రఖ్యాతమైన హొల్కారువంశమును నిలుపుమని హితోపదేశము నొనర్చితిని కాని నేనెగ్గు చేయలేదు. అయినను నామాటలు విషభోజనమువలె మీకు రుచింపవయ్యె మతిలేని వృద్ధజంబుకముయొక్క మాటలను, చితుకులమంటవలె వేగిరపాటుగలపడుచు వాని కారుకూతలను, నమ్ముకొని వారు మిమ్ము దరింపఁగలరని చిరకాలమునుండి రాజ్యమునకు మీకు నమితోపకారమొనర్చిన మావంటివారిని నిరాకరించితిరి వారు మిమ్ము ద్రోహముచేసినపుడే మీరు పశ్చాత్తాపమునొంది మరల మమ్మాదరింపగలరు ఇంక నేను మీవాఁడనని నాయందాశయుంచుకొనవద్దు నేను మీకును మీరాష్ట్రమునకు నిష్టుఁడనని మీరెంచినారుగనుక నేనట్లయుందును. కుమారుని బెంచుకొనరేని మీయొద్ద నేనుద్యోగము చేయను ఇవి త్రికరణశుద్ధిగ నేను వ్రాసినమాటలు ఇందుకు తిరుగులేదు" అని యున్న యొక యుత్తరమును జదువుకొనుచు మహారాణీ యహల్యాభాయి తన గదిలో నొక పీఠముపైఁ గూర్చుండి నడుమనడుమ ముక్తాభాయి యుత్తరమును గూర్చి తన్నడుగు ప్రశ్నలకుఁ బరాకుగఁ బ్రత్యుత్తరమిచ్చుచు గర్తవ్యము నూహించుచు రాధాకాంతుని నిమిత్త మెదురుచూచుచుండెను. అంతటితో రాధాకాంతు డరుదెంచి యథోచితముగఁ దనరాణికి నమస్కరించి యుచితాసనమున గూర్చుండెను ముక్తాభాయి చిన్నతనమునుండి రాధాకాంతునియందుఁ బితృభావముంచి గౌరవించుటచే నతని యొద్ద ఘోషాపద్ధతి యక్కఱలేక యథేచ్ఛముగ మాటలాడును. మహారాణి యంత రాధాకాంతుని మొగమువైపు చూచి "యీచమత్కారమును నీవెఱుఁగవు కాబోలును,

ఈ యుత్తరమును చదువుకొమ్ము" అని ఆ యుత్తరము నతనిపై వైచెను. అతఁడా యుత్తరమును నా మూలాగ్రముగ చదువుకొని విస్మయముతో నొకమూల గుండె కొట్టుకొని "అమ్మా జన్మాంతరం వెంటవాఁడయ్యెను ఇంతవాఁడగునని నేనెన్నఁడు నెఱుఁగను అమ్మా వ్యవహారము క్రమములించి రాగమున బడినది. మనము జాగ్రతగ నుండవలె" నని చెప్పెను అసలు నాదేమి "ఇటువంటి తుచ్ఛులు వేయి వన్నిగడలు పన్నినను నేను బెదరను. కాని వీని కాలు పూసన్నమగుటచె నిట్టి బుద్ధులు పుట్టినవి వాఁడు నాకు లోబడకున్నను వారి ప్రాణములు న ఖడ్గమునకు లోబడకమానవు కాని మనకు నెవ్వరు శత్రుష్ఠులుగ నుండిరో వారినందఱిఁ బేర్కొనుము" అని ప్రత్యుత్తరమిచ్చెను రాధాకాంతరావు పలుకుల నాలకించి రాణి మనోధైర్యమున కుబ్బి "రెనగా నా మనకు నాప్తుఁ అవని నిబపురమందుండుటలో మీరు మంచిపని చేసినారు గోమాజీరావు కొల్హాపూరు మంచివాఁడనియ తోచుచున్నది. తుకాజీ హోల్కారు మక్కువంటి విశ్వాసముగలవాఁడు కాని నీచుడగుటచే నతనికి సర్వ మైన యుద్యోగ మీయదగదు" అని యుగ్గడించుచుండ నతని మాట కడ్డమువచ్చి రాణి "వంశముచేత నీచుడైన గుణములచే నతఁడు రాజశ్రేష్ఠుఁడే మన తుకాజీ యుత్తముఁడు. అందుచే నతనికి సైన్యాధిపత్య మొసఁగెదను గోమాజీరావు సంగతి నిశ్చయముగ జెప్పజాలను నీ వాతనినిగూర్చి వాకబుచేయుచుండుము. కాని వీనికంటె నాకు నొక యెక్కువవిచారము పట్టినది ముక్తాబాయి నలతగనున్నది ఆమె కుబ్జావాని నిమిత్తము బెంగపెట్టుకొనినది మనోవ్యాధికి మందులేదుగద! దీనికేమియుపాయము చేయవలెనో యెఱుఁగను" అని పలికెను అప్పలుకులు విని రాధాకాంతరావు, రాణితో నిట్లనియెను "ఆమె నిజముగ బెంగ పెట్టుకొన్నది మనసు తమ్మునిమీద కరుగకుండ నిరంతరము నామె కుత్సాహజనకములగు పలుకులు చెప్పువారుండవలయు అట్లు చేయుటకు తమకు తీరికలేదు. నాదగ్గఱ నొకదాసియున్నది ఆమె బహు చమత్కార కథల నేర్చును విచ్చువారలకై నామె మొగముజూడ సకలదుఃఖములు పోవును ఆమెను నేనిక్కడికిం పెదను. ముక్తాబాయి గామెకు జతచేయుడు అంతట నామె దేహమున గల దుర్బలత నశించును ఇంక నేనెలవు గైకొని పోయివచ్చెదను కాని యడుగ మఱచినాఁడ దౌలతరావు విషయమై యేమిచేసినారు స్త్రీ రాజ్యమేలుచుండ స్త్రీకి మానగౌరవము దక్కకున్నచో నింక జెప్పవలదియేమి? అన్నియు ముగిసిన వెనుక మీరు కనుగొన్న నేమిలాభము? ఆమె ప్రాణత్యాగము చేసికొనకమునుపే యామె పాతివ్రత్యము చెడకమునుపే, మీరు సాయము చేయవలెను' అను రాధాకాంతుని కఠినోక్తులు రాణికి రోసము జాలియు గల్గించినందున నామె "ఓయీ నేను జీవించియుండగ

కమలాభాయికి మానభంగమగునా! దౌలతరావును బిలుపించి యిపుడే మందలించెద. ఇదివఱకే రమ్మని వానికి వర్తమానము పంపితిని ఎంత కష్టమునకైన నోర్చి యామెను రక్షించుదు నీవింక బోవచ్చు దౌలతరావు వచ్చువేళయైనది' అని పలికెను. రాధాకాంతుడంజలులు ఘటించి సెలవు గైకొని స్వగృహమున కరిగి కమలభాయి స్థితి గనుగొనమనియు, నామెతో గొన్ని రహస్యములు జెప్పుమనియు, తనభార్యనంపి యామె విషయమై జాగ్రతగనుండెను. రాధాకాంతరా వరిగిన యొక గడియలోపున దౌలతరావు తన యేలిక దర్శనమునకువచ్చి గుమ్మమునందుండి తనరాక దెలియబనిచెను లోపలికి రమ్మని సెలవయినతోడనే మొగమున లేని గాంభీర్యమును దెచ్చిపెట్టుకొని మొలలో నొకవేళ నపాయమేదయిన జరుగునేమోనని ప్రాణసంరక్షణార్థమై తెచ్చిపెట్టుకొన్న కయిజారు గనబడకుండజేసి లోనికరిగి రాణిదర్శనముజేసి సాష్టాంగ నమస్కారమునర్చి నిలువబడెను. రాణి నాలుగునిముషములు వానివంక జూచి కూర్చుండుమనెను తరువాత వారి యుభయులకు నీక్రిందిసంభాషణ జరిగెను.

అహ— పాపము మీ యన్నగారు పోయినందుకు మాకు చాలా విచారముగ నున్నది ఈవేళకు నాయనొకటి కాదా? నీకు పెద్దకష్టము వచ్చినది

దౌల— (తలవంచి) ఏమిచేయగలము కాలవశము వచ్చినది.

అహ— అతనిభార్య యెక్కడనున్నది క్రొత్తగా పెండ్లియైనదట కాదా?

దౌల— ఇక్కడనేయున్నది పెండ్లికాలేదని చెప్పుచున్నారు

అహ— ఛీ ఏమిమాటలు నాదగ్గఱకూడ నట్లే యనెదవేల? నీవామెను బలవంతముగ వివాహమాడ యత్నించుచున్నావట నారాజ్యములో నీవు దుర్మార్గము చేయకుము. ఇటువంటివానిని క్షమింపను. అన్నభార్యను పెండ్లియాడుటకు నీకు సిగ్గులేదా?

దౌల— అమ్మా నేనామెవిషయమై యట్టి దుష్కార్యము దలపెట్టలేదు. కిట్టనివారు చెప్పిన యబద్ధములు నమ్మి మీరు నన్ను శిక్షింపదలచుచున్నారు నేనట్టిపని చేయుదునా? అన్నభార్య తల్లి కాదా? పెండ్లికాలేదని నేను స్వీకరింపదలచితిని పెండ్లియైనమాట నిజమే నాకామెవద్దు

అహ— సరే జస్వంతరావు మాపై నలుకవహించినాడట నీవును నందు జేరినవాడవేనా? ఇంక నీవంటి నిర్భాగ్యులెందఱు—

దౌల—రామరామ నేనేపాపమెఱుగను. మీపాదములతోడు. శ్రీవిశ్వేశ్వర స్వామివారితోడు సెలవైన జస్వంతరావును పట్టియిచ్చెదను

అహ— తన ప్రాణముల కాశపడవద్దని జస్వంతరావుతో చెప్పుము మీరందఱు

చచ్చినట్లు భావించుకొనుఁడు. ఇఁక నీవుపో

అని యహల్యాభాయి దౌలతరావునంపెను. దౌలతరావు నోటికివచ్చినన్ని యసత్యములాడి రాణి యాగ్రహమునకు బాత్రుడు కాకుండ పులినోటబడి తప్పించుకొనిన మేకవలె సంతసించుచుపోయెను అట్లు దౌలతరా వింటికివచ్చునప్పటికిభార్య దుర్గభాయి గృహమునందు లేనందున నిదె సదని కామబాధావివశుడై కమలభాయియొక్క కమలములవంటి పాదములపైఁబడి తన్ను వివాహముచేసుకొమ్మని యామెను బహువిధముల బ్రార్థించెను కమల భయసంభ్రమములతో వడఁకుచు నాతని దన పాదములతోఁ దన్ని యాడరానిమ టలాడి యనేకవిధముల నిందించి రోదనముచేసెను మన్మథబాణ ఘాతముచే దేహము చల్లపడుటచే ములుకులవంటి యామెపలుకులంత పనిచేయదయ్యెను సిగ్గతని నీవలికే విడుచుటచే సిగ్గు వాని కగుపడదయ్యెను అందుచే నాతఁడు వడఁకుచున్న యా వన్నెలాడిని గట్టిగ బట్టుకొని సందిట జేర్చి యాలింగనసౌఖ్యము కొఱకు యత్నించుచుండ యామె బెదరిన మార్జాలమువలె మొదలెల్ల రక్కి యుపసాగెను ఆమె బరుకులు వాని యంగములనుండి రక్తము స్రవింపఁజేసి కుంకు మనలందుకొన్న పెండ్లికుమారుని విలాసము నతని కొసఁగెను ఇంతలో దుర్గవచ్చి తలుపుకొట్టినందున గమల యామెకు తలుపుతీసెను దౌలతరావుచేసిన చర్యలను దుర్గ కమలాముఖమున విని యిట్టి మగనికి దాను భార్యగా నుండుటకు సిగ్గుపడి కమల నూరార్చి మగనిన శూలములవంటి మాటలతో నొప్పించెను. కాని నల్లబాయివలె నతఁడు నిరుత్తరుడై కమలను వశముచేసుకొను నుపాయమును వెదకుచుండెను ఇట్లతఁ డాలోచనలు సలుపుచుండఁగనే సూర్యుఁ డపరశైల శిఖరము నలంకరించెను రాత్రి యందఱు భోజనములుచేసి పండుకొన్నతరువాత నిద్రాసక్తులైరి రెండుజాములరాత్రయైన తరువాత దౌలతరావు తాను నిద్రించుచున్న గదివిడిచి తళతళ మెరయుచున్న ఖడ్గమును కేలఁబూని కమల శయనించు గది ప్రవేశించి "దురాత్మురాలా, కమలా నీవు నాకు నక్కఱకురానిదానవు నీవుండిననేమి చచ్చిననేమి దీని నిపుడు చంపివేయుదును" అని ఖడ్గ మామె మెడమీదనుంచి యొకవేటున వేయఁ గల్తునైత్తెను. అంతలో నామె ముఖవికాసచంద్రికలు కోపావేశాంధకారమును బాపినందున "ఈమె నిపుడు చంపను. ముందుముందీమె తప్పక నావశము గాఁగలదు కాకపోయినచో నపుడే తుదముట్టించెద" నని తన దుష్ప్రయత్నముమాని మరల లోనికిం జని నిద్రించెను నాలుగుగడియలరాత్రి యుండఁ గమల మొగమున మేలిముసుఁగు దిగజారవేసుకొని యెవరితోడను జెప్పక గృహమునుండి వెడలిపోయెను, యెక్కడికరిగినదో యెవ్వరునెఱుఁగరు ఉదయమున దుర్గయు దౌలతరావును కమలం గానక కలవెలపడి దుండిరావును లక్ష్మణుని వెదకుమని

బంపిరి. అందు దుండిరావెచ్చటనో గంజాయిద్రాగి మత్తిలిపండుకొని సాయంకాల మునవచ్చి కమల కనబడలేదని చెప్పెను. దీపములు పెట్టినతరువాత లక్ష్మణుడు వగర్చు కొనుచువచ్చి దౌలతరావుతో రహస్యముగ "అయ్యా నల్లమందు చెట్లతోటలోనున్న నూతులో బడి కమలచచ్చినది శవ మొకగడియక్రిందట తేలినది" అని భయపడుచుం జెప్ప దౌలతరావు తలయూచి "సరే భయమేమి నేను చేయవలసినపని తానే చేసు కొనినది కాని యెవరికి తెలియకుండ దహనము చేయుడు" అని పలికి నాలుగు రూపాయలిచ్చి వానిని దుండిరావునంపెను. వీరిరువురు తోటలోనికి జనునప్పటికి నూతియొద్దున నొక వృద్ధుడును నొక పడుచువాడును నపుడే తేలిన శవమునుజూచి విలపించుచుండిరి. అందు వృద్ధుడు "అమ్మా నిన్నీ బలవంతపు మరణము పాలుజేయు టకే వానికిచ్చి పెండ్లిచేసితిని కాకున్నచో నీమరుంది కింత చేటుకాలము రాదు" అని విలపింప నందు పడుచువాడు వాని నూరార్చి యిది యేడువదగినసమయము గాదు. ఎవ్వరో వచ్చుచున్నారు పదపద యని వానిని గెంటుకొనిపోయెను తరువాత దుండి రావును లక్ష్మణుడును మెల్లగా శవమును బయటికితీసి మోచికొనిపోయి దహనము చేసిరి.

తొమ్మిదవ ప్రకరణము.

ధరణీ రమణికిం గాలపురుషుండు పట్టిన ధవళచ్ఛత్రమువలె చంద్రుఁడు గగన భాగము నలంకరించి చెట్లకుఁ బర్వతములకు సమస్తపదార్థములకు సఫేదు పూతబూసిన తెరగునఁ దన వెన్నెల వ్యాపింపఁజేసి వాని కపూర్వధావళ్యము నొసంగెను ఆ వెన్నెలలోఁ దన యజమానుని యాజ్ఞ శిరసావహించి దుండిరావు మహూపుర సమీప మునమున్న గూడెముఁజేరి యందున్న ఋషి కుటీరము బ్రవేశించెను. ఋషి వానినిఁ జూచి యాలింగనముఁ జేసికొని "నాయనా! దుండీ నీవు వచ్చితివా? మన రాణోజీ మృతినొందినాడుగదా దౌలతరావుచేయునదియేమి" యని యడుగుటయు దుండిరావు వానికి నుత్తరము చెప్పుటకు యత్నించుచుండ నింతలో దీర్ఘకాయుఁడును, మహా సత్వుఁడునగు నొక నల్లని మనుష్యుఁడు కుటీరముఁజొచ్చి వారిసంభాషణ కాటంకము గావించెను ఆ పురుషుని గడ్డము కాయముకంటె కొంచెము నల్లనై జుట్టువలె నతి దీర్ఘమై యుండెను. అతని శిరమున నల్లుకొన్న జడలును, జడలనడుమ నతఁడు చూడామణిగ నుంచుకొన్న నెమలి పింఛములును, మెడను ధరించిన పలుతంగులుగల పూసలును, గండ్రగొడ్డలితోనున్న కుడిచేయియు నతఁడు పర్వతప్రాంతముల వసించు నాటవికుఁడని తెలియఁజేయును. చింతనిప్పులవలెనుండు వాని కన్నులగవనుండి వెడలు దృష్టి రాతిగుండెగల దుండిరావునకుఁగూడ భయంకరమై యుండెనన నింక చెప్పనది

యేమి? అతఁడు లోపలఁ బ్రవేశించి తన మోటమహారాష్ట్రపు మాటలతో నిట్లనియెను “శాంతియా రాలేదా? ఈ ఢుండిరావువచ్చి మీతో నేమిచెప్పినాఁడు? మనమితఁడు చెప్పినట్లు చేయవచ్చునా?” అన, ఋషి “ఓయీ గండా వచ్చి కూర్చుండుము” అని నిర్మలముగ విచారింపవలసిన యంశములు యీ ఢుండిరావు చెప్పినమాటలు విను” అని తన సందేశమెఱిగింపుమని ఢుండిరావును హెచ్చరించెను అనంతరము ఢుండిరావు మెల్లమెల్లగా నిట్లు పలికెను “ఓయీ గండాఖిల్లుఁడా! మన పుణ్యము పుచ్చినది. జస్వంతరావు, దౌలతరావు, గోమాజీరావు మొదలగు ప్రబలులు రాణితోఁ బగ సాధించి కత్తిఁగట్టినారు అందుచే నీవును నీ ఖిల్లుసైన్యము వారికి సహాయముగవచ్చి రాణి నెదిర్చితివేని యుభయులకును లాభముండును. నీవు దోచుకొన్నసొమ్ము నీవే దైకొమ్ము అదిగాక మలహారురావు హొల్కారు మరణము నొందునపుడు తన మనుమఁడు జచ్చునేని కోడలు మరల నొకని దత్తముఁజేసికోవలయునని మరణశాసనమును వ్రాసినాఁడు. వారి బంధుగులకుఱ్ఱవాఁడె యున్నాఁడు. మనవా రాబాలుని హొల్కారుగఁజేసి కొద్దిదినములలోఁ బట్టాభిషేకముఁజేతురు క్రొత్త హొల్కారునకు మీరు సహాయము చేయుఁడు

ఋషి— ఆ హొల్కారును నేనెఱుఁగుదును ఆహాహా! మిక్కిలి బాగున్నది గండా, నీకు సందేహమెందుకు? అహల్యాభాయి సింహాసనముమీఁద నుండదు రాఘాకాంతరావుతోఁ జెప్పినాను. శ్యామసుందరదత్తు నాతో మాటలాడినప్పుడు నేను వారిపక్షము పల్కితినిగాని నేను వారి సంహారము చూచువాఁడను. మలహారురావు నా కపకారముఁజేసినాఁడు. అకని నేనిపుడు తీర్చుకుందును దేశమును మంగలములోఁ బెట్టి వేచివేయవలెను నీ రెండువేలఖిల్లు సైన్యముతోఁ ద్రోపుడు వెంటనే యారంభింపుము నీకు నాదీవన నిచ్చెదను ప్రజలకు నావయస్సునుబట్టి నాపై మిగుల భక్తిగలదు వారు నా మాయాసముద్రమునఁబడి మునిఁగినవారలు. నీవు జంకకు

గండఖిల్లీపలుకుల నాలకించి యడవిజంతువువలె ఖణిల్లని యొకవింత కేకవేసి “యిదిసరి యిదిసరి. నాతమాషచూడుము ఈపని నెరవేరునేని నూరు దున్నపోతులను శ్రీకాళికి బలియిచ్చెదను దొరికినయెడల మనుష్యుని బలియిచ్చెదను ఢుండీ నేనిందులకు సమ్మతించితినని మీ దౌలతరావుతోఁ జెప్పుము.

ఢుండి— మలహారురావు మనయీ, ఋషికి నపకారముఁజేసెను అహల్య కమలాభాయిని వివాహమాడవద్దని దౌలతరావును నిందించి యనరానిమాటలనని పరాభవించినది. అదిగాక కమల నూతిలోఁబడి మృతినొందినది. కాఁబట్టి దౌలతరావు

రాణిపైఁ గల కసిఁదీర్చుకొనుటకు మిమ్ముఁ గలియఁగోరినాఁడు. ఇది ఋషికిని మీకును నిష్టమని ప్రభువుతోఁ జెప్పి క్రొత్త హోల్కారు పట్టాభిషేక ప్రయత్నములు చేయుచుండెదము. నీవును ద్రోహము నారంభింపుము.

అని చెప్పి ఋషికి నమస్కరించి గండాభిల్లునొద్ద సెలవుఁ గైకొనఁబోవుచుండ నొక మనుష్యుఁడు ౧౭ వత్సరముల బాలుని నొకని వెంటఁబెట్టుకొనివచ్చెను. ఈ వచ్చిన మనుష్యుఁడు సర్వలక్షణముల గండాభిల్లుకంటె నెక్కువ విపరీతముగాను, నెక్కువ భయంకరముగానుండెను. కాని యతనికంటె నొక యంగుళము పొట్టి. గండాభిల్లుకంటె పొట్టియగాక యతఁడు వానికంటెఁ గ్రూరుఁడు. వెంటనున్న బాలుఁడు గడగడ వణఁకుచు వెఱ్ఱివెఱ్ఱిచూపులు చూడసాగెను. అతఁడు సౌందర్యశాలి. తాంతియాభిల్లు బాలునితో, ఋషి కుటీరముఁ జేరి గండభిల్లునిఁ జూచి "ఓరీ నీనిమిత్తమై సుందరుఁడగు పిల్లవానిఁ దెచ్చినాను. పునహానుండి యీ కుఱ్ఱవాఁ డిందూరినగరమునకుఁ బయనమై పోవుచున్నాఁడు. ఈతని నీ యిష్టము వచ్చినట్లు చేసికొమ్ము" అని యబ్బాలుని చేయిఁబట్టి లాగిచూపెను. ఋషి వాని మొగమును దీపపు వెలుగునఁ బరీక్షించి చూచి "యీతఁడు కాళికి బలినిమిత్త ముపయోగించును. తీసికొనివెళ్లి బలియిమ్ము." అని యుత్సాహము గల్గునట్లు పల్కెను. పలుకుటయు నబ్బాలుని గుండె జల్లుమని యొడలెల్లఁ జెమ్మటలు పట్టెను. పట్టినతోడనే "అయ్యో" యని కేకవేసి గుభాలున మూర్ఛిల్లి నేలరాలిన మోడువలెఁ బడి స్మృతిదప్పియుండెను. తాంతియా వానిఁ జూచి మహాకోపముతో "దొంగవేషము వేసెదవా? బద్మాష్" అని కొరడాతో రెండు చెళ్లుచెళ్లున వీపుపైఁ జరచెను. కాని భయావేశము కవచముగాఁగల యాబాలుఁడు దెబ్బలవలన మేలుకొనఁడయ్యెను "ఇప్పుడే యీతని బలిపెట్టుదము రా" యని తాంతియాభిల్లుఁ గండభిల్లు వెంటఁబెట్టుకొని యాబాలుని శవమువలె మోసికొనిపోయిరి. ఈ బాలుని ప్రాణముల నెట్లయిన రక్షింపవలయునని మండిరావునకు సదుద్దేశముఁ గలిగినది. కాని యీమాట వారితోఁ జెప్పినచో వారు తన్నే చంపుదురని భయపడి యూరకుండి మెల్లగాఁ దన స్వామియొద్దకుఁ జనెను.

ఇది యైన కొన్నిదినములకే దేశమునం దక్కడక్కడ బందిపోటులు, కన్నపు దొంగతనములు, దారులు గొట్టుటయు నారంభమై దేశమంతయు నట్టుడికినట్లుడుకసాగెను. స్త్రీలను జెరపట్టుటయు, దొంగతనములును, మానప్రాణములకును మర్యాదలకు నాశము లేకుండఁ జేయ జనులందఱు రాణితో మొఱ్ఱపెట్టుకొని యీ రాజ్యమునుండి పారిపోవుదుమని చెప్పిరి. నిరంతరమును గ్రామములు పరశురామ ప్రీతియగుటచేతను,

జనులు పులులవలె వేటాడఁబడుటచేతను నహల్యాభాయి ప్రజల దైన్యమును, స్వసైన్య ద్రోహమును దన యసహాయస్థితియు నరాజకమును జూచి విసిగి చేయునది లేక దుఃఖితయయి రాజ్యభారమును విడిచి మంత్రులకు లోబడుట యుచితమని యోచించుటకుఁ గూడ సిద్ధమయ్యెను. అటుండి రాధాకాంతుని, శ్యామసుందరుని బిలిపించి యాపె వారితో నిట్లనియెను. “అయ్యా! ఇఁక నా రాజ్యమెందుకు? నేను యిది వదలి కాశీ నగరముఁజేరి విశ్వేశ్వరస్వామివారి చరణముల నాశ్రయించుట మంచిదని కనబడుచున్నది. పరమ పతివ్రతయగు కమలాభాయి నిష్కారణముగ నూతిలో దిగి చచ్చినది ఆ నేరమును బట్టుకొని యీ పాపాత్ముల శిక్షించువారు లేరైరి. మీదిమిక్కిలి జస్వంతరావు ప్రేరణచే రఘునాథరావు మనపై దండువెడలునఁట. అది నిజమని పేష్వా సభలోనున్న దాదాజీ గోక్లా తనతో చెప్పెనని మన క్రిష్ణపంతు నిన్ననే పునహానుండి వచ్చి చెప్పినాఁడు. భిల్లులోకమూల ప్రజలను మాయ్చుచున్నారు. ప్రజలు నాజీవనమున కుసూరుమన్నతరువాత నా రాజ్యమెందుకు? పన్నులుఁగైకొని సుఖియించుటకా! నేనేమి చేయుదును.” అని నిర్విణ్ణురాలై పలుకు మహారాణిఁ జూచి రాధాకాంతుఁడు “అమ్మా యీ దురాత్ములు లోఁబడకపోరు. పాప మెన్నఁడును నెగ్గదు. నేను, శ్యామసుందరదత్తు, తుకాజీ, శివనానా జీవముతోనుండ నిందూరు రాజ్యలక్ష్మి యీ దురాత్ములచేఁ జిక్కదు. మీరు మాకు ధైర్యము చెప్పవలసినది. మీరధైర్యపడకుందురేని మేమెంత కార్యములనైన సాధింపనేర్తుము. విచారము వద్దు అమ్మా యీ ముక్తాభాయికి శరీరమున సుఖముగనున్నదా? దాసీ యెట్లున్నది” అని పలుక నహల్యాభాయి “నేను మిమ్ము నమ్మియున్నాను. నీవును, శ్యామసుందరదత్తును బోయి దొంగలఁ బట్టుకొనుఁడు. మఱియొక విచారము నాకు లేదు. నీవు పంపిన దాసిమూలమున నాకూఁతురు బ్రతికినది. అది కడు చమత్కారి. ఏడ్చువారిని నవ్వించును. సీతాభాయి మొగముఁ జూడ నన్ని విచారములు నశించును” అని చెప్పెను. శ్యామసుందరుఁ డంత “అమ్మా యిదె నేనును రాధాకాంతరావుగారును నరిగి దొంగలలో ముఖ్యులఁ బ్రాణములతోఁ దెచ్చి మీకొప్పగించెదము. సెలవొసంగుఁడు పోయెదము తుకాజీని సైన్యముతో సిద్ధముగ నుండుమని యానతిండు” అని రాధాకాంతరావును దత్తును రాణిని వీడ్కొనిపోయిరి.

పదియవ ప్రకరణము.

సూర్యరశ్మి యెట్టిదో యెన్నఁడు నెఱుఁగనట్టి చీమదూరని చిట్టడవియని చెప్పఁదగిన వింధ్యపర్వతప్రాంత వనభూమియం దొకచోట, కొండగుట్టలచే నావరింపఁ

బడు నొక కోనలో నొకనాఁ డుదయమున నాకాశమును బీటలు వారఁజేయు మహా కోలాహల ముదయించెను. అడవిమృగములవలె ఘీంకారాది భయంకర ధ్వనుల తోడను, సింహనాదములతోడను భిల్లు లందఱు మతావేశము నొంది, భక్తిపారవశ్యతచేత నెదుట వృక్షమునకుఁ గట్టఁబడిన బాలకునిపై దృష్టులు నిగుడ్చిరి. ఆ బాలకుని శరీర మందంతట జేగురుగంధము పూయఁబడెను. మొగమున నెఱ్ఱని కుంకుమబొట్టు పెట్టి, యప్పుడప్పుడే యంటఁబడిన తలనుండి నీటికణములు జారవికచారవిందములబోలు రెండుకన్నులనుండి బాష్పజలములొలుక నా బాలకుండు భిల్లురవలన శ్రీ కాళికి బలి యీబడుటకు సిద్ధముగనుండెను అతని హృదయస్థితదుఃఖమును వేడికన్నీరు తెలుపుచుండెనేకాని మోటుమాటలు తెలుపుట లేదు. వెనుక శాంతియాభిల్లు త్రోవలో బట్టుకొన్న సుందరాకారుఁడగు బాలుడాదినమున గండభిల్లుచే దమదేవతకు బలి యీబడుచుండుటయే యీ కోలాహలమునకు గారణము. అమితానందరసమున నోలలాడుచు భిల్లులు భిల్లాంగనలుండ బల్లివలె చెట్టున కంటిపెట్టుకొని యమితదుఃఖ రసమున నీవత్స యమలోకప్రయాణమునకు మూటగట్టుకొనెను. అపుడు వారిలో కులపెద్ద తళతళమెఱయు ఖడ్గంబూని యొటునుండి నఱకుటకు సులువుగ నుండునో యని కత్తి మెడపై, భిల్లులు సింహనాదముసేయ, భిల్లాంగనలు చప్పటులు చరువ నొక్కవ్రేటు వేసెను. ఆవ్రేటుతో బాలుని శిరము తెగి నేలఁబడవలసినదె కాని యా కత్తివాడు మెడ రెండవవైపునకు ద్రిప్పినందున నాయేటు వానికిం దగులదయ్యె. అంతట నా కుమారుఁడు స్మృతిదెచ్చుకొని చేతులుజోడించి గండభిల్లునిజూచి నమస్కరించి "అయ్యా నన్నేల మీదేవతకు బలియిచ్చెదరు. మాతల్లికి నేనొక్కడనె కుమారుడను. ఈనడుమ మా చిన్నతమ్ముడు మశూచకమువచ్చి చచ్చినాడు. నేను మాయక్కను చూచిపోవలయునని పునహానుండి వచ్చుచున్నాను. నేను తండ్రిలేని బిడ్డను. మిగుల బీదదనము ననుభవింపుచు దిక్కులేని నా కుటుంబమును బోషించుకొనుటకు నొక్కడనైన పదిరూపాయల యుద్యోగము సంపాదింపవలెనని పుట్టెడాశతో మా బంధువుల నాశ్రయింప నిటు లింమూరు నగరమునకుఁ బోవుచున్నాను. నేనేమో యుద్యోగము సంపాదించి తమ్ము పోషించునంతటి ప్రయోజకుఁడ నగుదునని గంపంత కోర్కెతో నాతల్లి నాకయి యెదురుచూచుచుండును. నన్నువిడిచి యీపుణ్యముఁ గట్టుకొమ్ము" అని ప్రార్థించెను. ఆప్రార్థనలు వినఁ గొందఱు భిల్లులకును, భిల్లాంగనలకును, హృదయముల గరుణారస ముదయించెను. కాని శాంతియాభిల్లున కాగ్రహ ముదయించి గురువునుజూచి "ఈ పాపాత్ముని వదలవద్దు. వదలినచో దేవి కాగ్రహమువచ్చును. ఇదివఱకు మన మిన్నిపల్లెలుదోచిన మనము పట్టుబడకుంట

కీడు కార్యమేకదా కారణము. కావున వేగమె తల తెగవేయుడు. అని పలికెను. తోడనే మనుష్యాకారము నెత్తిన వ్యాఘ్రమువంటి యా గురువును మనుష్యప్రాణముల దీయుటలో చిరతరానుభవముగల తన కుడిచేయి నెత్తి శిరము దేహమునుండి తెగవేయుటకు గత్తి మెడపైఁ జేర్చు వాటను జూచి ఎఱల ఖడ్గము నెత్తెను. అందఱు ‘‘జయ భవతి’’ యని యరచిరి. ఆబాలుఁడు కనులుమూసికొని రామరామయంచు మెడపైఁ గత్తిపడినదనుకొనెను. అంతలో మూఁగిన మనుష్యసంఘమునందు ‘‘వచ్చె వచ్చె, మరాటిదండు, మరాటిదండు’’ అని మహాధ్వనులు వెడలెను. వెంటనే ప్రాణములకై పరతెంచువారును, బాణములకై పరువిడువారును, విండ్లు గేలఁబూనువారును, చేఁడ్లవలె రాళ్లుబట్టువారును నై భిల్లభిల్లాంగనాబృందము చిందరవందరయయ్యెను. ఈనడుమ మరాటిదండు వారిపై బడ దత్సైన్యముఖమున నుత్తమతురంగముపై నెక్కి భిల్లుల కనులకు రుద్రునివలెనున్న రాధాకాంతరావును, కుమారస్వామివలె వెనుకనున్న శ్యామసుందరదత్తును గానఁబడిరి. గురువు ఖడ్గమును చంకక్రింద బెట్టుకొని పారిపోవుటయు, గొందఱు భిల్లులు గురువుగారిమార్గము ననవలంబించుటయు, శేషులైన యాటవికులు మరాటులపైబడి యెదిర్చి కొందఱు దూరమునుండి శిలావర్షము గురిసియు, గొంతవడి యమ్ములవానలు వర్షించియు, గొంతసేపు ఖడ్గాఖడ్గిని బోరియు, హోరాహోరిగా యుద్ధము చేసిరి తుపాకులు, పిచ్చుకత్తులు, మొదలగు నాగరికపు పనిముట్లుండుటచే మరాటులు శత్రుసంహారమున నెక్కువ సులువుగలవారై మోటకయ్యమునేయు భిల్లులఁదోలిరి. వీరశిఖామణియగు రాధాకాంతునకు వీపుపై నొకకత్తిపెట్టు గాయము తగులుటయు, నీదుఃఖము నుపశమింప శ్యామసుందరదత్తుచే భిల్లనాయకుండగు గండభిల్లు పట్టువడుటయు నను రెండు కార్యములీ యుద్ధఫలితములు. వృద్ధుఁడగు రాధాకాంతునకుఁ దగిలిన గాయమపాయకరమైనదగుటచే నటదగిన వైద్యము జరుగదని దత్తాతనికొక బండి చేయించి తగు పరివారము నిచ్చి ముందుగా నిందూరు నగరమున కంపి తాను వెనుకనుండి దొంగను దీసికొనివత్తునని చెప్పి యాతని నంపెను. యుద్ధము జరుగుచుండ గొందఱు భిల్లులు బలియీఁబడుటకు వృక్షమునకు గట్టఁబడ్డ బాలుని కట్లు తొట్రుపాటుతో విప్పి బరబర లాగుకొని పోయిరి. శ్యామసుందరదత్తు గండాభిల్లుని వెంటబెట్టుకొని నలుగురు సేవకులతో మెల్లమెల్లగ బయనము సేయుచు, గడుమన్నెములు, బర్వతప్రాంతములును, దాటి రెండుదినములకు మన ఋషియున్న కుటీరసమీపమునకువచ్చి సాయంకాలమైనందున నచ్చట విశ్రమింపఁదలఁచెను. దత్తుతోనున్న నలువురు సేవకులలో నొకఁడు గండభిల్లునకు పరిచయుఁడుండుటచే వాఁడతనితో నపుడపుడు సగము వినబడి వినఁబడ

తుండునట్లు మాటలాడుచు జాలిగల్గునట్లు కన్నీరువిడుచుచు దన్ను చెరనుండి విడిపింపుమని బహువిధముల బ్రార్థించెను. కాని కత్తెరబోనువలె దస్తురు, ద్వాన భటులు నుండుటచేఁ బ్రత్యుత్తరమిచ్చుటకుగాని చెఱనుండి వానిని విడిపించుటకు గాని యా బ్రౌతునకు వీలులేదయ్యె. గండభిల్లు తన మరణ మింక నిశ్చయమనియు నేచెట్టునకో గట్టి తన్నుహత్యభాయి యురిదీయుదురనియుఁ గడు విచారగ్రస్తుఁడై చచ్చిన పులివలెనుండి యేపనిచేయుటకు వీలులేకుండ జేతులువిరిచి కట్టబడినందున నప్రయోజకుఁడై యుండెను. ఇరిగూరునగర మొక క్రోసుదగ్గఱకు వచ్చినకొలఁదిని తన మరణమొకదినము సమీపమగుచున్నదని గండాభిల్లు రోదనముసేయుచు దాను చేసిన పాపములను, నరహత్యలను, రాజద్రోహములును, దలంచి కుంగిపెట్టుకొని నిద్రాహారముల నైకొనడయ్యె. గండభిల్లు చిక్కినవార్త విన్నవారందఱు సంతసించి పండుగలు జేసుకొనుచుండిరి. ఈ దొంగను శ్యామసుందరదత్తు ఋషి కుటీరమునందుంచి కాలుచేతులు గట్టి నలువురు సేవకులను జుట్టు కాపుపెట్టి, జామున కొకరిని మేల్కొనుమని యానతిచ్చి, తాను, వెలుపల నొకమంచముపై బండుకొనెను. అంతట ఋషి యాతనితో "నాయనా యీ పాపాత్ముడు దొరికినందుకు దేశమంతయు సంతసించుచున్నారు వీనిని వేగముగ గడతేర్పుము. ఈకార్యము చేసినందుకు నీకీర్తి శాశ్వతమైయుండును. ఈదురాత్ముఁడు ప్రజలను బెట్టిన క్షోభమింతింత కాదు. వారి యుసురు నేడు తగిలినదికాబోలును." అని ముచ్చటించెను. "ఇది తను యాశీర్వచనము. తమరు హోల్కారువంశమునకు మేలుసేయఁ దలఁపమే లెంచుకు నేకూరదు. ఇది మీ చలవకాదా" యని దత్తుత్తరముచెప్పెను. ఆసమయమున నొక తురక వెదకుకొనుచువచ్చి "అయ్యా, యిచ్చట శ్యామసుందరదత్తుగారున్నారా!" యని యడిగెను. దత్తు తత్తరపాటుతో లేచి "అబ్దుల్ నబీ యేమి యిప్పుడు వచ్చినావు? తొందర యేమైన నున్నదా?" అని యడుగ "మహారాజా తొందరలులేవు. రాణిగారు మనకు హుకుము జారీచేయించినారు అదితెచ్చినాను." అనిచెప్పి యుత్తరమును జేతికీయ నాజాబును దత్తు చదువుకొని "పాప మింతత్వరగానది యగునని నేను తలఁచలేదు." అని యుత్తరమును మడచుచుండెను. ఋషి యదియేమని యడుగుచుండగనె దత్తు లోపలికిపోయి ఋషిని రమ్మని పిలిచి గండాభిల్లును మేలుకొలిపి యిట్లనియెను ఓయీ మహారాణిగారిట్లుత్తరము వ్రాసినారు, చదువుచున్నాను విను "గండాభిల్లు నిటకు దీసుకొని రానక్కఱలేదు భిల్లులు, బిడారులు, గాండ్లు మొదలగు వనవాసులింక ముందెట్టి రాజద్రోహము సలుపకుండ బుద్ధిగలుగునట్లు వారినందఱఁ జేర్చి వారికి భయముగలుగునట్లు చెట్టునకుగట్టి గండా

ఖిల్లుచు తేప్రుదయమున నురిదీయవలెను." అని వ్రాసినారు. కాఁబట్టి నీమరణము తేప్రుదయమున నని కరితముగాఁ జెప్పి తనకు కొంచెముకన్నీరువచ్చుటచే నట నుండలేక వెలుపలికిఁ జని పండువెన్నెలలో బవ్వళించెను. గండాఖిల్లు దత్తువచనములు విని పిడుగుపడినవానిచందమున కట్టుబొమ్మయై యప్పుడే చచ్చినట్లుండెను. తరువాత ఋషి వానిని గొంత యోదార్చెను ఆ పండువెన్నెలలో నాటిరాత్రి దత్తునకు గండాఖిల్లుయొక్క మరణవృత్తాంతమును దెలుపవలసివచ్చినందుకు విచారమేగాక మఱియొకవిచారముకూడ జ్ఞప్తికివచ్చెను. ఆనాటి పూర్ణచంద్ర సందర్శనముచే దత్తుయొక్క మోహపయోధి యుబ్బి మలయమారుత ప్రేరితములగు మహా మోహతరంగము లున్నతములగుటచే హద్దుమీరెను. కమలయొక్క ప్రథమదర్శనమును, వృషభసంహారమును మొదలగు నాటిపనులెల్ల కన్నులకు గట్టిన ట్లగుటఁ గనఁబడి దత్తునకించుకసేపు గండాఖిల్లుపై మఱపుగొల్పి రాజభక్తిం గూడ మరపించెను. అందుచే చిత్తస్థైర్యంబు చెడినందున నాతఁడు లేచి జాగ్రతగ నుండుమని సేవకులతో జెప్పి వానిని ఋషి కొప్పగించి తనకు గమలాదర్శనమైన స్థానమునకుఁ జనెను. అరిగి "హా సుందరీ! హా కమలా! నీ వెంత యల్పాయుష్యమంతురాలవైతివే వృషభము బారినుండి తప్పించుకొంటివి గనుక చిరకాలజీవివగుదువనుకొంటినిగాని యింతలో నిట్టి బలవన్మరణము గలుగునని తలఁపనైతిని. నీవు స్వర్గమునందు సుఖింపుచు, నాహృదయము నపహరించుకొని పోయినావు. నన్నుఁగూడ నీ సాన్నిధ్యమునకేల గొనపోరాదు, నిన్ను జూచిన కన్నులతో నింకొక కన్యను జూడజాలను. నిన్ను దలచిన మనసుతో నింకొకకన్యం దలపఁజాలను" అని విలపించి యూరటలేక "ఇచ్చటనేకదా నీనిమిత్తము సేనెద్దును వాడికోలలచేఁ గూలనేసితిని. ఇచ్చోటనె గద నిన్ను సందిటం గదియబట్టి నామనసార నీమొగము తెప్పవాల్పక చూచుచు నిన్ను గూర్చుండబెట్టితిని ఇందేగదా నీవు నన్ను వాలుచూపులఁ జూచి నా కాసగొల్పినది" యని యానాటిచర్యలెల్ల దలచి యాయాస్థానములకరిగి కూర్చుండుచు, లేచుచు, బవ్వళించుచు మన్మథబాణ ప్రహారముల కోర్వక విహరించుచుండెను.

పదునొకండవ ప్రకరణము.

ఇట్లు శ్యామసుందరదత్తు విచారించి విచారించి ప్రొద్దుపోవుచునప్పటికి రమారమి జామురాత్రియుండెను. అందుచే జాల నాలస్యమైనదని యెంతసేపు విచారించినను గత జలసేతుబంధనమేకాని మృతినొందిన కమల మఱల రాదనియు నెఱింగి ఋషి కుటీరాభిముఖుఁడై చనెను. చనుచు మార్గమధ్యమున "తెల్లవారుచున్నది, గండా

భిల్లుని నే నుఱిదీయింపవలెను గాఁబోలు. ఈవఱ కెన్నండు నిట్టి దారుణకార్యము నేనాచరించియుండలేదు. ఈపని నాకుఁ బంపఁబడినందుకు నాకు మిగుల కష్టముగనున్నది. నేనెట్లు చేయుదు? అయినను రాజభక్తియుఁ బ్రజాక్షేమముఁ జూచి యిద్దురాత్ముని జంపవలె. రాణిసెలవు తప్పదుగద!" యని తనలోఁ దాను వితర్కించుకొనుచు నే వృక్షమునకుఁ బ్రాఁడువేయిం యురిదీయింపదగునని యోచించుచు నిరుప్రక్కల నున్న మహావృక్షములఁ బరీక్షించుచు నడువసాగెను. ఇట్లు నడచి నడచి యొక కొంతసేపటికి ఋషి కుటీరసమీపమునకు నరుగుదెంచి యాశ్రమముముందరఁ గన్ను జెదరునట్లు కుంకుమ నీటివలెనున్న రక్తమునుఁ జూచి యాశ్చర్యమునొంది నిర్ఘాంతపడి నిలుచుండెను. నిలిచి నలుదెసలుఁ బరికింపఁ దన సేవకులలో నొకనిశిర మొకవైపునను, మొండెమొకవైపునను బడియుండుట వానికన్నుల కగుపడగా దత్తుచిత్తము తత్తరమంద లోనికిం జనియెను. చనినతోడనే వాని యాశ్చర్యమేమని చెప్పుదును. కుటీరములోఁ దన మువ్వురు సేవకులుగాని గండాభిల్లుగాని కనఁబడరైరి. కాలుసేతులు వెనుకకు విఱుగఁగొట్టబడుటచే గదలమెదల నేరక నోట గుడ్డలు గ్రుక్కఁబడుటచే మాటలాడనేరక యొకమూల బడియున్న ఋషినిమాత్ర మతఁడు చూచి మెల్లగా వానిని లేవనెత్తి యొకచోట గూర్చుండబెట్టి కట్లువిప్పి నోటనున్న గుడ్డలఁ గూడఁ దీసి యీ వైచిత్రమునకుఁ గారణమడిగెను. ఋషి కొంత సేదదేరి నీరసముతో నిట్లు చెప్పెను. "నాయనా! నీవేల నరిగితివి? నీకొంప నాకొంపఁ గూడఁ దీసితివి. నీవెట్టి పాపపుగడియల బయలుదేరితివో నీవు కుటీరము వెడలినతోడనె నలువురు భిల్లులు మాపైఁబడిరి. తరువాత నేమి చెప్పుదను తండ్రీ, విశ్వాసముగల శూరశిఖామణియగు నీ సేవకుడు కాచలికాచుచు వారి నెదుర్కొన వారొక్క మహూర్తమున వానినిఁ దమ కత్తికి నెరజేసిరి. తరువాత నే నెదిరింపఁబోవ నన్నిట్లు చేసి చెఱలోనున్న గండాభిల్లును వదలించుకొని పారిపోయిరి. వారరిగిన కొంత సేపటికి నీ మువ్వురు సేవకులు మెలకువఁ దెచ్చుకొని నాస్థితిఁ జూడకయె దొంగలేదని భయపడి యెక్కడికో పరుగెత్తిరి. ఇంతకుమించ నే నేమియు నెఱుఁగను. నాకుటీరమున నిట్టిపని జరిగినందున నన్నుఁగూర్చి ప్రజలేమని చెప్పుకొందురో యని నాకుఁ దలకొట్టినట్లున్నది. పాపము పుణ్యము పరమాత్ముడెఱుఁగును." అని ఋషి తన వాక్యము సమాప్తముఁ జేయునప్పటికి, దత్తుఁడు విచారాశ్చర్యసముద్రమగ్నుడై తన జీవనము సమాప్తమయ్యెనని యెంచుకొనెను. ఈసేవకులె వారిని విడిచిరో భిల్లులే వదలించుకొనిపోయిరో యని సంశయమొందుచు దన భవిష్యదభివృద్ధియను వృక్షమునకుఁ బిడుగుపాటువలెఁ దటస్థించిన యీకార్యమునకు వగచుచు నిశ్చేష్టుఁడై

గోడకుఁ జేరఁబడి కూర్చుండి యిట్లు వితర్కించెను. "హా దైవమా! యెంతపని జరిగించితివి నాకావిరహతాపము నాపాపముచేఁ గలిగినదికాఁ బోలును ఏం ఖుము దీని విడిచి యేమరితిని. ఏమొగముఁ బెట్టుకొని యింక నిందూరు పోవుదును ఏమొగము బెట్టుకొని యహల్యాబాయి రాణి మొగము జూతును నేనేమో సంస్థానమంత నడ్పింప గల సమర్థుడననియు, కృతజ్ఞుడననియు, నన్నీకార్యమునందు రాణియు రాధాకాంత రావును నియోగింప నేను కామాతురుడనై చేతులారఁ దొంగను వదలుకొంటిని వాఁడు పారిపోయెనని నేనెంతఁ జెప్పినను నామాట లీకుట్రదినములలో నమ్మువా రెవ్వరు. జస్వంతరావుతోఁ గలసి దొంగను నేను విడిచితినని జనులు నన్నాజన్మాంతము సకలంకునిఁగ నెన్నుదురు. నేనిచ్చట మృతినొందక యిందూరుపురి కేల పోవలయును. అయినను రాణితో నాతప్పు విన్నవించి ప్రథమలోపమును క్షమియింపుమని యామెపాదములపైఁ బడెదను. నాకంటె నాసేవకుడె కృతజ్ఞుఁడుగదా. రాణిసొమ్ముఁ దిని చుంచుటచేఁ దనప్రాణమును రాణికిచ్చి రాజఋణమును దీర్చుకొనెను. ఇంతచదువు చదువుకొని యెక్కువ యధికారినైన నైదురూకలు జీతముగల బంటురౌతుపాటి రాజభక్తిఁ జూపజాలనైతిని. ఛీ నాబ్రదుకేల" యని పరిపరివిధములఁ జింతించుచు నంతలో సేవకులు మువ్వురు దీనముఖులై వచ్చి శ్యామసుందరదత్తునెదుట నిలిచిరి. దత్తు వారిని గనుగొని దిగ్గున లేచి "దొంగ యేమైనాఁడురా" యని యడిగెను. అడుగుటయు వారు కన్నీరు తమ నిర్దోషిత్వమునుఁ దెలియఁజేయ దత్తుపాదములపైఁ బడి "స్వామీ మేము ముగ్గురము నిద్రించుచుంటిమి మా నిద్రలో నీగొడవయెల్లఁ జరిగినది. మేము లేచునప్పటికి నీఋషి బద్ధుడై యుండెను. మా ప్రియమిత్రుడగు మీసేవకుఁడు నిష్కారణముగ మృతినొందెను. మేము మెలకువ వచ్చినతరువాత దొంగలు దొరుకుదురేమోయని తరుముకొనిపోతిమి కాని మాశ్రమ వ్యర్థమైనది." అని రోదనముఁ జేయుచుఁ దన పాదముల విడువకయున్నవారికి హెచ్చరిక పట్టుఁ బలికి యభయహస్తమిచ్చి ఋషియొద్ద సెలవు గైకొని పయనము సాగించెను. ప్రాణములకు మానమునకుఁగూడ హానికరమగుపని తానే చేఁజేతల జేసుకొంటిననియు రాధాకాంత రాయునకుఁగూడ తనమూలమున నప్రతిష్ఠ సంఘటిల్లుననియు, రాణి యిట్టివిషయములఁ దన్ను క్షమియింపదనియు, నెటి గి యారంభమున విచారభారము మెండగుటచే నాహారనిద్రలమాని హెచ్చరిక లేమిచే నడక చకచకసాగక మెల్లగ నిందూరుపురి కరుగుచుండెను. త్రోవలో సేవకులలో నొకరు దత్తును గనుఁగొని "అయ్యా! మన ప్రాణముల రక్షించుకొనుట కుపాయ మొకటికలదు. దొంగ పారిపోయెనని చెప్పుటకు మాఱు దొంగను దీసితిమని మనము చెప్పినచో మన ప్రాణములు దక్కును."

SCIENCE PAPER SERIES No 5.

(WATER)— నీరు.

పదార్థములలో గొన్ని కఠినములుగను, మరికొన్ని ద్రవములుగను, ఇంకను కొన్ని వాయురూపములుగను, యుండునని ఇదివరలో వక్కాణించియుంటిమి. జలము ద్రవపదార్థమయినను దాని ఘనపరిమాణమును బలముచే నణగించుట యశక్యము. సృష్టికర్త మనలకు గల్పించిన వస్తుజాలములో శ్రేష్ఠతరమైన పదార్థములలో ముఖ్యమయినది యీ జలము. ఈపదార్థస్వభావమునుగూర్చి గొంచెము విచారింతము.


ఈ జలమను ద్రవ్యము ద్వంధమయినట్టియు, స్వభావవిరోధంబులయినట్టియు వాయుపదార్థముల సమ్మేళనముచే నుత్పత్తిల్లుచున్నది. అనగా మనకు వలయునపుడెల్ల ఈ వాయుద్రవ్యము లనేకముగ గూర్పగలిగినంగాని జలమును సంపాదించుటయసాధ్యమని చెప్పుటకాదు. కాని ఈ జలమును గొన్ని యుపాయంబుల విభజింపగలిగినపుడు, దానివలన ప్రాణవాయువును (Oxygen) జలవాయువును (Hydrogen) వెలువడుచుండును. దీనికి నిదర్శనముగ నొక యనుకూలమయిన పాత్రలో నీరుంచి యందున విద్యుచ్ఛక్తి ప్రవాహమును ప్రవేశింపచేయగలిగినచో నా జలము విభజింపబడి ప్రాణవాయువును, జలవాయువును గలుగచేయుచుండును. ఇంతియగాక మన మొక యనుకూలమయిన గాజుగొట్టములో రెండువంతులు జలవాయువును, ఒకవంతు ప్రాణవాయువును సమకూర్చి యాగొట్టమున విద్యుచ్ఛక్తినిం బ్రవేశింపచేసినచో, నా వాయుపదార్థములు సంగమమై జలమును గలుగచేయుచున్నవి. గనుకనే శాస్త్రజ్ఞులు, జలము ప్రాణజలవాయువుల సంగమముచే గలుగుచున్నదని ప్రపంచమునకు దృఢముగ దెలియపరచియున్నవారు.

భూమిపైనుండు ద్రవపదార్థము గుండ్రని నిమ్మపండుపైనుండు చర్మమువలెనే ఉపరిభాగమున కంటియుండును. ఉపరిభాగముననుండు నీరు భూమివలె మెరక పల్లములు గలిగియుండక, చదునుగలదై సర్వత్ర సమముగ నుండును. గాని మనము నివసించియుండు భూమి పలకవలె నుండక గుండ్రముగ నుండుటంబట్టి దానిపై యావరించియుండు సముద్రజలము, అంటిపెట్టుకొనియుండు చదునైన మూతను బోలియుండును. భూమి తన యాకర్షణశక్తిచే నిట్టి జలమయమయిన కప్పును స్వస్థలమునుండి భ్రమించకయుండునటుల గాపాడుచుండును. ద్రవ్యపదార్థములకు ముఖ్యస్వభావ మెక్కడనైనను చదునుగ నావరించియుండుట. ఇందువలననే పర్వతశిఖరములనుండి క్రిందికి ప్రవహించునపుడు జలము, క్రిందుగ పడిన వెంటనే పూర్వ

వట్టముగ నెత్తున కెగసి యాకాశమున నాధారము లేకపోవుటచే దిరుగ క్రిందికి పడు చుండును. దీనికి కారణమేమనగా, జలము పర్వతముపై నుండినపుడు ఉన్నతముగ నుండియున్నది. ఆ యున్నత స్థలము వదలి క్రిందిభాగమున బ్రవేశించుచున్నను తిరుగ పూర్వపు ఉన్నత స్థితిని పొందుటకు బ్రయత్నించును. ఈ గుణము నీటియందుండుట వలననే విస్తరించి నీటి సదుపాయములు చేసికొనుటకు కారణమగుచున్నది. చెన్నపట్ట ణంబున బ్రతిగృహమునకును సన్నని గొట్టములగుండ జలసదుపాయము చేయబడినది. కొన్నికొన్ని స్థలములందా గొట్టములు మేడలపైకిని మిద్దెపైకిని తీసికొనిపోబడు చున్నవి. వీనిగుండ ప్రవహించు జలము చెన్నపట్టణమునకు కొన్ని మైళ్ళదూరమున నెత్తు ప్రదేశమందున్న చెరువు (Red hills tank) నుండి వెలువడి వచ్చుచున్నది. ఈ చెరువు ఉన్నత ప్రదేశమునను, పట్టణము క్రిందిభాగమునను యుండుటంజేసి ఉన్నత ప్రదేశమునుండి వచ్చు జలము గొట్టములగుండ మేడలకును మిద్దెలకును కొనిపో బడుచున్నది. అయినను ఎన్నడుగాని ఈ చెరువులోని నీరు చెరువు వట్టమునకన్న నెత్తుగనుండు ప్రదేశములకు తీసికొనపోబడలేదు.

జలమువలన నితర పదార్థములు యణపబడగలవు. జలమున కీశక్తి లోతు హెచ్చినకొలది ప్రబలుచుండును. విస్తారపు లోతుగల జలమున కడుగున నున్న, పదార్థము తక్కువలోతు నీళ్ల యడుగున నున్న వస్తువకన్న నెక్కువగ యణచబడును. ఒక పాత్రలో నీరుంచి దాని పైభాగమును మనము చేతితో నణచితిమేని యందువలన గలుగు చలనము జలమునందంతట నలుప్రక్కల సమముగ వ్యాపించును. అనగా పాత్రలోనుండు ప్రతి నీటిబిందువును ఏక సమయమున సమానముగ నణపబడును. ఇట్టి గుణము జలమునకుండుటచే మన కెన్నియో యంత్రోపకరణములు సాధ్యము లగుచున్నవి. ఒక చదరపుటంగుళము విరివిగల మూతి గల్గినట్టియు, సమానమైన పరిమాణముగల మరి నాలుగు ప్రక్కద్వారములు గలిగినట్టియు, నొక గుండ్రని గాజు కాయవలన మన మనేక సంగతులు తెలిసికొనవచ్చును. ఇట్టి కాయ నొకదానిని సంపాదించి దాని ద్వారముల నన్నిటిని చులకని బెండుముక్కలచే వదులుగ మూయ వలయును. ఇట్లుండినపుడు మనము చేతితో నా ముఖముననున్న బెండును యణచినచో, ప్రక్కనున్న మూతలన్నియు సమముగ నేక కాలమున నీటిచే త్రోయ బడును. ముఖమువద్దనున్న నీరు చేతితో యణపబడినపుడు యా తొందరను నది సర్వత్ర సమముగ వ్యాపింపజేయుచున్నది. గనుకనె ప్రక్కనున్న బెండుముక్క లన్నియు సమముగ నేక కాలమున తమతమ స్థలములనుండి త్రోయబడినవి. ఈ నిదర్శనములవలననే బలిమిచే యణపబడిన నీరు దాని చలనమును సర్వత్ర సమముగ

వ్యాపింపచేయుచుండునని మనము నిశ్చయముగ యూహింపవచ్చును. ఇదియునుంగాక ఒక చదరపుటంగుళము విరివిగల నీటి ముఖద్వారము యణపబడినప్పుడు యాచలనము సమపరిమాణస్థలములయం దేకవిధముగ వెల్లడిచేయబడుచుండును.

ఇట్లు పైన యుదహరింపబడిన గాజుకాయవిషయములో ముఖమును యణచుటకు బదులు, ముఖముపై నొకపౌను బరువుంచినచో, ముఖద్వారమున గొంతవరకు నీరు క్రిందికిపోవుచున్నది. ఇందువలననే ప్రక్కలనున్న నాలుగుద్వారములవద్దనున్న నీరు ఒక్కొకపౌను బరువుచే వేరువేరుగ త్రోయబడినట్లు పైకి త్రోయబడుచున్నది. ఈ నాలుగుద్వారములు వేర్వేరుగ నుండుటకు బదులుగ నేకస్థలమున నుండునప్పుడును పైన యుదహరింపబడినయట్లనే నీరు ప్రవర్తించును. అనగా ఒకపౌను బరువుచే ముఖద్వారమును యణచినపుడు విరివిగైన రెండవద్వారముఖమందుండు నీరు నాల్గురెట్లు బరువుచే త్రోయబడినట్లు త్రోయబడుచుండును. గనుక నొక యనుకూలమయిన యంత్రమందు రెండుద్వారములుంచి, అందులో నొకటిచిన్నదిగను, రెండవది కొన్నిరెట్లు మొదటిదానికన్న పెద్దదిగను యుండునట్లేర్పరచినచో, మనము స్వల్పమయిన బలము నుపయోగించి ఎక్కువబలమును గల్పించుకొనవచ్చును. ప్రకృతమందిట్టి సాధనములు విరివియైన పదార్థములను కొద్దిపాటివానిగా మార్చుట కుపయోగింపబడుచున్నవి. హైడ్రాలిక్ (Hydrolic Press) యంత్ర మిట్టిదియే. ఈయంత్రమునం దొకవిధమయిన పాత్రయుండును. అది మూడుభాగములుగ నుండునని జెప్పవచ్చును. యది  యను చిహ్నముపోలిన గొట్టము. ఈగొట్టమునందుండు యొకకొమ్ము సన్నని రంధ్రము గలిగినదియు, రెండవది మొదటిదానికన్న యనేకసార్లు విరివియైన రంధ్రము గలిగినదియునై యుండును. ఈపాత్రలో సన్ననికొమ్మొకభాగము- విరివియైనకొమ్ము రెండవభాగము. ఈ రెంటిని కలుపుచుండుమార్గము మరియొకభాగము. సాధారణముగ యంత్రనిర్మాణరహస్య మిట్టిదియే యైనను, సదుపాయముకొరకేర్పరచిన మరికొన్నిసాధనములుగూడ నీయంత్రంబుల గానవచ్చును ఇట్టియంత్రంబుల జరుగు పనినిగురించి కొంచె మాలోచింతము. పైన యుదహరింపబడిన పాత్రవంటి పాత్రలో నీరుంచబడియుండును. అందలి సన్నని కొమ్ములోని నీరు యణపబడుచుండును విరివియైన రంధ్రముగల కొమ్ముపైన, పైకిని క్రిందికిని యాడుచుండు మూతయొకటి ఏర్పరచబడియుండును. ఆ మూతయొక్క ఉపరిభాగమున దూదిబస్తాలు మొదలయినవి యుంచబడును. ఈ బస్తాలకు పైన బలమైన ఇనుపకమ్ములుగాని మానుదూలములుగాని తాసియుండును.

అప్పుడు సన్ననిగొట్టములోని నీరు తగుపాటి బలముచే నణపబడును. ఈబలమే నీటిమార్గమున విరివైన రంధ్రమునఁ జొచ్చి, చక్కఁగనుండు నీటిని యనేకరెట్లు బలముచే పైకి త్రోసివేయును. అందువలన యీ నీటిపైనున్న మూత పైకెగయును. అది యెగయునప్పుడు పూదిసరకులు బిట్టుగ నొక్కఁబడును. కాని నిజముగ కొద్దిబల మెక్కువబలమును సృష్టించుట లేకున్నది. ఎందువలననగా సన్ననిగొట్టమందుండు నీరు నాలుగంగుళములలోతుకు త్రోయబడినప్పుడు పెద్దగొట్టమందుండు నీరుకూడ నాలుగుయంగుళముల యెత్తుకు త్రోయబడినచో నిజముగ బలము సృష్టింపబడినదని యూహింపవచ్చును గాని యట్లుండదు. రెండవగొట్టము మొదటిదానికన్న నూరురెట్లుండినచో నందులోని నీరు నాలుగంగుళములకు బదులు $\frac{4}{100}$ అనగా $\frac{1}{100}$ (అంగుళములో నూరోవంతు) ఎత్తునకు మాత్రము త్రోయబడుచున్నది. గనుక నిజముగ బలము వృద్ధియగుట లేదుగాని కొద్దిపాటి శక్తిని విరివిగ నుపయోగించుటకిదియె ముఖ్యసాధనమని యెంచుట కెంతమాత్రమును సందేహము లేదు.

నీటియందుండు పదార్థములు ఎప్పుడును పైనుండి క్రిందికిని, క్రిందినుండి పైకిని త్రోయబడుచుండును. విరివైన ముఖద్వారము గలిగిన యొకపాత్రలో నీరుంచి యానీటిలో దీపపు గాజుకాయ నొకదాని నుంచవలయును. ఈ గాజుకాయకు నిరుప్రక్కల ద్వారములుండుటచే నిది విడిగా నీళ్లలో నుంచబడినప్పుడే సులభముగ యడుగునకు పోవును. ఈకాయ కడుగున నొక తగుపాటి దళసరైన కాకితపు బిళ్లను మూతగ నేర్పరచి దానికి మధ్యను నొక కొక్కెము తగిల్చి యా కొక్కెమునకు సన్నని దారమొకటి యమర్చి యా దారమును గాజుకాయ లోపలినుండి బయటకు రానిచ్చి చేతితో నొక్కిబట్టినయెడల యీ గాజుకాయ యడుగున మూతగలిగినదానివలె కనుపించును. అట్టి స్థితిలో నా గాజుకాయను పాత్రలోని నీటిలో దింపవలయును. మూతలేనప్పుడు యీ గాజుకాయ యతి సులభముగ యడుగుకు పోగలిగినను యిప్పుడట్లు పోజాలదు. ఇదియునుంగాక మన చేతిలో పట్టిన దారమును వదలినను కాకితపుబిళ్ల గాజుకాయనే యంటియుండును. ఇది యెందువలననగా కాకితపుమూతకు క్రిందుగనుండు నీరంతయు దానిని పైకి నెగవేయుచుండును. ఈ నిదర్శనమువలన నీరు దానియందుండు పదార్థములను పైకి నెగవేయుచుండునని చెప్పుట కెంతమాత్రము సందేహింపబనిలేదు. ఇట్టి శక్తినే బాయన్సీ (Boyancey అని శాస్త్రజ్ఞులు వక్కాణించుచున్నారు.

పైన చెప్పబడిన దృష్టాంతరమందు పాత్రలోనొకయంగుళము నీరుండి, గాజుకాయ ఒకయరయంగుళము లోతువరకు దింపబడినచో, గాజుకాయ కడుగునయున్న కాకితపు మూతకు క్రిందుగ ఒక యరయంగుళము నీరుండును. ఇంతలోతు నీటితోనున్న యీమూత పైకి త్రోయబడుచుండును. పాతికయంగుళలోతున నుంచబడినచో ముప్పాతిక అంగుళలోతునీటిచే పైకి త్రోయబడుచుండును. ఇట్లు పైకి త్రోయబడుచున్నపుడు మూత గాజుకాయను అంటియుండును. కాని గాజుకాయలో పాత్రలోనున్న నీటిమట్టమువరకు నీరుపోసినచో, యామూత క్రిందికిపడిపోవుచున్నది గనుక నీరు రెండువిధములుగ పదార్థములను యెత్తుచుండునన్న సంగతి ఇందువలననే స్పష్టమగుచున్నది.

దోనెలు, పడవలు మొదలగునవి నీటిపై తేలుటకు కారణము నీటిత్రోపుడు శక్తియే. ఇట్టి శక్తిని కనబఱచుటకనేక నిదర్శనములుగలవు. అందులనొకటి నీక్రింద బొందుపరచుచున్నాము. ఒకగుఱ్ఱమునకు రెండువైపుల నీరుగలిగిన తోలుసంచులు వేయబడినవి. ఆసంచులకడుగుభాగమున సూక్ష్మమయిన ద్వారములు రెండుగలవు వానికి రెండు తగిన కన్నములమూత లేర్పరుపబడినవి. సంచులయందెంతమాత్రము నీరుండినను ఈమూత లణగియుండును. ఒకప్పుడిట్టి గుఱ్ఱమొకనదిలోనికి ప్రవేశించినది. ఆసంచులు నీటిలో చాలభాగమువరకు మునిగినవి వెంటనే నీటిత్రోపుడు శక్తి సంచులకడుగునయుండు సూక్ష్మద్వారముల తెగయగొట్టి, నదిలోనున్న నీటిని సంచులలోనికి ప్రవేశింపచేసినది. సంచులు నిండుసమయమున అశ్వము వెనుకకు మళ్లినది. మళ్లినవెంటనే నీటియొక్క త్రోపుడుశక్తి పని చాలించినది. ఒడ్డునకు వచ్చినవెంటనే పరిశీలన చేయబడగా సంచులనిండ నీరు కనుపించినది. ఇంతియేగాక ఏబరువునుగాని నీటిలో లేవనెత్తుట, లాగికొనివచ్చుట అతి సులభముగనుండును. ఇవియంతయు యీ నీటియొక్క త్రోపుడుశక్తి మహిమయే.

ఇట్టిశక్తి నీటియందుండుటచేతనే పదార్థములు నీటిలోనున్నపుడు తమ బరువును కొంతవరకు బోగొట్టుకొనుచుండునని వినుచున్నాము. ఇందులకుదాహరణముగ నొకకథయున్నది. దానిని కొంచెము వివరింతము. పూర్వమున నొకరాజు తన కిరీటమునున్నది బంగారముగాదని యనుమానపడి దగ్గరనున్న మంత్రివరులలో నొకడైన ఆర్కిమిడీస్ (Archimedes) అను గణితశాస్త్రజ్ఞుని పిలచి వానికి తన యనుమానమును వెల్లడిచేసి దాని త్వరలో నివృత్తింపుమని యానతిచ్చెను. పరిపరివిధంబుల బరిశీలించెనుగాని యీ శాస్త్రజ్ఞుడు చాలకాలమువరకు తెలిసికొనలేకపోయెను. ఒకనాటికాలమున తాను ఏటిలో స్నానము చేయుచుండెను. స్నానము చేయునపుడు

తన శరీరము పైకి త్రోయబడుట కనిపెట్టి పదార్థములు నీటిలో నున్నపుడు తప్పక కొంత బరువును బోగొట్టుకొనునని యూహించి యింటికిపోయెను. వెంటనే సువర్ణపు తునకనొకదాని దెప్పించి బయట త్రాసులో తూచి దాని బరువు కనిపెట్టి, పిమ్మట దానినే నీళ్లలోనుంచి తూచెను. బయట ౧౯ పౌనులు తూగిన బంగారపు తునక నీటిలో ౧౮ పౌనులే తూగినది తత్క్షణమే రాజుగారి కిరీటము తెప్పించి ఇట్లు దానిని పరిశీలించెను. పరిశీలించగానే దానియం దారోపించబడిన దోషము బయలుబడినది. రాజు తన మంత్రివరుని బుద్ధి కుశలతకు మెచ్చి యనేక బహుమానముల నొసంగెను.

సాధారణముగ పదార్థములు నీటిలో నుంచబడినపుడు తమ ఘనపరిమాణము (Volume) తో సరియైన పరిమాణముగల నీరెంతతూగునో అంత బరువును పోగొట్టుకొనుచున్నవి. బంగారము నీటిలో ౧౯ పాళ్లకు నొకపాలు పోగొట్టుకొనుచున్నది. అనగా సమమయిన ఘనపరిమాణములుగల బంగారమును నీరును బరువున బోల్చినచో నీటికన్న బంగారము ౧౯ రెట్లెక్కువతూగును. ఇట్లు ప్రతివస్తువునకును నీటితో బోల్చిచూచి తదనుకూలమయిన సంఖ్యల నేర్పరచియున్నారు. వీటినే, స్పెసిఫిక్ గ్రావిటీ (specific gravity) యని పిలుచుచున్నారు.

పదార్థములు నీటిలో నున్నపుడు తమ ఘన పరిమాణముతో సమమయిన ఘన పరిమాణముగల నీటియొక్క బరువును బోగొట్టుకొనునని ఇదివరలో నుడివియుంటిమిగదా ఇందువలన పదార్థములు నీటియెడల ముత్త్రివిధంబుల బ్రవర్తించుచుండును ఈ మూటినికూడ ఒక చిన్న నిదర్శనముచే తెలియచేయవచ్చును. మూడు పాత్రలలో నీరుంచి ప్రతిపాత్రలో నొక్కొక గ్రుడ్డును ఉంచవలయును. ఈ గ్రుడ్లు మూడును బరువున భేదించియుండవలయును. అట్లుండినచో, ఒకపాత్రలోని గ్రుడ్డు పూర్ణముగ యడుగంటుటయు, మరియొకపాత్రలోనున్నది త్రిశంకువలె మధ్యను వ్రేలాడుచుండుటయు, వేరొకపాత్రలోనిది నీటిపై తేలియుండుటయు మనము కనిపెట్టగలుగుదుము. ఇందులకు కారణము లేవియన — మొదటిగ్రుడ్డుయొక్క బరువు సమమైన ఘనపరిమాణముగల నీటిబరువుకన్న యెక్కువగ నుండుటచే, యాగ్రుడ్డు యడుగంటినది. రెండవదాని బరువు సమమైన ఘనపరిమాణముగల నీటి బరువునకు సమానముగ నుండుటచే నాగ్రుడ్డు మధ్య సమత్వముగ వ్రేలాడుచుండును. మూడవదానియొక్క బరువు నీటిబరువుకన్న తక్కువ యగుటచే నాగ్రుడ్డు నీటిపై తేలుచుండును. అందువలన కఱ్ఱ, బెండు మొదలగునవి తేలుటయు, బంగారము మొదలగునవి మునుగుటయు మన మెప్పుడు చూచుచుందుము. గనుక

ఇనుపపడవలు మొదలగునవి కట్టబడినప్పుడు కట్టువాండ్రీసంగతిఁబట్టి తమపనులు నెరవేర్చుకొనుచుందురు.

సాధారణముగ మన శరీరము నీటిలో తేలును గాని శిరస్సు బరువు యగుటచే ఈదుట కష్టసాధ్యముగనున్నది. అందువలననే శిరస్సు బరువులేని ఇతరజంతువులకు ఈతకొట్టు స్వభావసిద్ధముగ సులభముగా నుండును.

నీ రెప్పుడును తన మట్టమును మించిపోనేరదు గాని కొన్నిసమయముల యట్లుపోవుటకూడ కనుపించుచున్నది. నీటిని యంటిపెట్టి ఏదైన సూక్ష్మరంధ్రములుగల పదార్థముండినచో దానిలోనికి నీరుమట్టమునకెత్తుగ పోవుచున్నది. ఇట్లనే ద్రవపదార్థములన్నియు లేచును. దీపపువత్తులకును కాగిన పిడకలకును, చెట్లు మొదలగువానికిని, చమురును నీరును ఇట్లనె ఎక్కుచున్నవి. నీరుండినపాత్రలో సన్ననిగొట్టము నొకదానినుంచినచో గొట్టములోనికి నీరుమట్టముకన్న ఎత్తుగ నెగయుచున్నది. ఒకప్పుడు ద్రవపదార్థభేదమునుబట్టి, యది మట్టముపైకి పోవుటకు బదులు మట్టముకన్న క్రిందుగ బోవుటకూడ కద్దు. ఆయా ద్రవపదార్థమునకును సూక్ష్మనాళమునకును యనుబంధము లేనిచో ఇట్లు సంభవించుచుండును. సన్నని గాజుగొట్టములగుండ నీరు ఎగయును. కాని పాదరసము క్రిందికిపోవును. ఈ గుణమునే కాపిలరీ (Capillary attraction) యనుబంధమని వాడుచున్నారు.

నీటిబలమున ననేకపనులు సాగుచున్నవి. ఎత్తునుంచి నీరు బారునపుడు పారు నీటిలో నొకచక్రముంచినచో నది గిరగిర దిరుగును. ఈచలనము మరిపేనియందైన ననుకూలముగ ప్రవేశింపజేసినచో, నాశక్తివలన ననేకపనులు చేయబడగలవు. ఇట్లు అనేకులు అమెరికా ఐరోపాఖండములయందు లాభపడుచున్నారు.

నీరు దాహద్రవ్యములలో ముఖ్యమయినది గావున దానినిగురించి మనమెంతో జాగ్రతగనుండినను తీరదు. మన చెరువులలోను గుంటలలోను యుండు నీటిని సూక్ష్మవస్తుదర్శకయంత్రము (Microscope) తో చూచినయెడ ననేకప్రాణుల గనపట్టును. నీటిలోనుండు యణుమాత్రపు జీవులు యధికమయినచో, నీరు త్రాగుట కనర్హముగ నుండును. నీరు మురిగినకొలది దానియందుండు యణుమాత్రపు విష జంతువులు అభివృద్ధిని చెందుచుండును. ఆనీటిని మనము త్రాగినచో యాజీవులన్నియు రక్తములో ప్రవేశించి దేహారోగ్యమును చెరచి తుదకు మనల నకాల మృత్యువున కప్పగించును. సాధారణముగ విషూచి మొదలగు మహాజాడ్యములు నీటి యశుభ్రతవలననే గలుగుచుండును. ఇందులకు చిత్రములైన నిదర్శనములు గలవు. అవి యీక్రింద వక్కాణించుచున్నాము.

ఆ ౧౮౫౪ వ సం॥ లండను పట్టణమున కలరా వ్యాపించి బ్రాడ్ స్ట్రీట్ (Broad street) అను ప్రదేశమందుండు జనులు చాలవరకు నశించిరి. ఈ ప్రదేశమందొక నూయి గలదు. ఆ నూతిలోని నీరు గొట్టములగుండ ప్రజలకు సాధ్యముగ చేయబడినది. అదివరలో కలరావల్ల ఒక పిల్లవాడు పోయియుండెను. ఆ పిల్లవాని మలము ఎవరికిని తెలియకుండునటుల యీ నూతిలో పారవేయబడినది. ఆ ప్రదేశమందుండు జనులందరును ఆ నూతినీటిని త్రాగువారగుటచేత ఆ నీటిగుణమువలన జనులు చాల వరకు నశించిరి. ఇందులకు నిదర్శనముగ నొక విచిత్రమయిన సంగతి యొకటి సంభవించినది. చిన్ననాటనుండియు యీ నూతినీటికి అలవాటుపడి ఇప్పటికిని అనీటినే త్రాగుచున్న ఒక ముసలిమనిషి బ్రాడ్ స్ట్రీటుకు చాలమైళ్ళదూరమున నున్న నొకభాగములో నివశించియుండెను. అనుదినము ఆమనిషి ఆ నూతినీటినే త్రాగుచుండుటచే యీమెశరీరమున విషూచి యంకురించి, క్రమమున యీమెను మరణము నొందించెను. ఆమె నివశించియుండు స్థలమున యీమెతప్ప మరి యెవరును నశించి యుండలేదు. గనుక ఆ నూతినీళ్లు కలరాజాడ్యమును పుట్టించినదని చెప్పుటకు సంశయమెంతమాత్రము నవసరములేదు. ఇట్లనే మనదేశములో ఆ ౧౮౭౭ సం॥ న తిరున్వేలి జిల్లాలో చేరిన పెదకంకోలము గ్రామమున సంభవించినది. ఆ సంవత్సరమున ననేకమంది యగ్రజాతివారాగ్రామమున విషూచివలన మృతులయిరి. ఆగ్రామమున రెండునూతులుండిన అందులనొకటి యగ్రజాతివారు తక్క మరి యెవరును ఉపయోగింపవల్లకాదు. రెండవ నూతినీరు ఇతరజాతివారందరు వాడుకొనుచుండిరి. మొదటి నూతిచుట్టును మురికిగుంటలు, మలరాసులు, మొదలగు నశుద్ధప్రదేశము లనేకములు గలవు. ఇందుల నీరు చాలకాలమునుంచి యుపయోగింపబడినను ఇప్పటివరకు అంత యెక్కువగ చెడిపోయియుండలేదు. ఆనూతినీరు త్రాగు జనులందరు యగ్రజాతివారగుటచే, అగ్రజాతివారిలో విషూచివలన మరణము లెక్కువగ నుండినవి. రెండవ నూతినీరు బాగుగ నుండుటచే ఇతరజాతుల జనము నశింపనేలేదు. కాని ఈగ్రామమందుగూడ యొక విచిత్రమయినవిషయము సంభవించినది. బ్రాహ్మణనూతినీరు త్రాగుచున్న ఒక చాకలివాడును వాని కుటుంబమును విషూచివలన నష్టపోయిరి. దీనివలన యగ్రజాతివారి నూతినీరే ఆ విషూచివ్యాపకమునకు కారణమని వేరుగ నుడువనేల? గనుకనే మనమన్నిటికంటె నీటివిషయమున యతిజాగ్రతగ నుండవలయునని తెలిసిన శాస్త్రజ్ఞులందరును చెప్పుచున్నారు.

లేక నరపతి యరసి యీ సదనములెట్లు సుఖప్రదములుగా నుండునో యట్లును గట్టింపవచ్చును. గోడ, యింటివెడలుపున, నైదవపాలెక్కువయెత్తు, నాలవవంతు వెడలుపు నుండఁదగు మొదటి యంతస్తునకుఁ గోలయిది పైఁబై నంతస్తులకు వాని వెడలుపునకు సమము కంబములతోఁ గోడలతో నేని వేఱుగఁ గదులు మూడే నైదే నేడేని నిర్మింపఁజను, నాలుగుదెసల, నెనిమిదింట నడిమి రెండుపాళ్లైన ద్వారాంశములు రెండు రెండు ధనసంతానప్రదములు, అచటనైగాని యెన్నఁడును వేఱొక విధమున గుమ్మమెత్తరాదు గదులలో వేఱుగఁ గిటికీలు సుగమిచ్చునట్లు పెట్టఁజను. ఇంటిద్వారము మఱియొక యింటిద్వారమునకుఁ జెట్టునకు మూలకు స్తంభమునకు దారికిఁ బీరమునకు నూతికి నెదురుగా నుండఁగూడదు. ప్రాసాదమండపముల ద్వారము దారికడ్డముగానున్న దోసములేదు ఇంటిపునాది, యెత్తులో నాల్గవపాలుండవలయు. మేడలకు మండపములకు మూలబంధము పొడవున సగమునం జుగు. కిటికీ యొకదానికొకటి లిన్నగనై యుండవలయు పెంకుఁగప్పు, మందిరపు వెడలుపున సగము నడియెత్తుండునట్లు, లేక, దానిపైఁబడిన నీరు సులువుగఁ గ్రిందఁబడు వడుపున వేయవలెఁగాని పొట్టిగాఁ బల్లముగా వేయరాదు చుట్టుగోడ, దొంగలు దాఁటలేని యంత యెత్తు, దాన, సగము వెడలుపు, సగము, మూడవపాలేని సరాసరి పునాది మంచి గట్టి పెక్కు బురుజులు తూముకాలువలు, పొట్టి యెదురుగోడ,యుఁగలిగి, చేరువఁ గొండలేక, తుపాకులుదాల్చిన సిపాయిబళ్ల మెపుడును గాచునదియుఁ గావలయు కందకము, ప్రాకారమున కతి సమీపము గాక, నీటి లోఁతునకు రెట్టివెడలుపుగాఁదగు రహస్యసాధన సామగ్రులు నతి యుద్ధనిపుణులు లేనికోట, భూపాలునకుఁ జెఱసాలయె కాని మేలొసఁగదు ఎకిమీని యాస్థానము సురక్షితము నతి రమణీయము, మూఁడై, దేడేని గదులతో నత్యంత విస్తృతము, నుత్తర దక్షిణముల నిడివికిఁ దూర్పు పడమరలు రెండు మూడేనిరెట్లు వెలుపై, యిచ్చవచ్చినట్లు బూఁకఁడు రెండు మూడే నంతస్తులు వెలయ, నుప్పరిగలు, సజ్జలునుప్ప, గదుల నన్నిప్రక్కలఁ గిటికీల మెఱసియుండఁ గట్టింపఁజను. నడిమిగది ప్రక్కదానికంటె రెట్టివెడలుపు, దాని నైదవపాలెక్కువ, లేక సమమే నవు నెత్తునుండఁ జనును గదుల్కుఁ గప్పుగాని డాబాగాని వేయఁదగు. ప్రక్కవి రెండంతస్తులున్న నడిమిగది యొకయంతస్తై కాఁదగు వేరుగఁ గంబములు గొనఁగల మేలిగదులు గదిరి నలుత్రోవల నడుమ నిరవై నీరు పైకెగయింప, సరిగమ పధని స్వరములు చక్కఁగఁబాడ, గాలిరావింప వాటపడు యంత్రములు గడియారములు మించుటద్దములు చిత్తరువులును వెలయు నొలగము కార్యముల నారయ నేలికకుండ వలయు. అట్టివె, ప్రధానులకు లేఁకరులకు సభ్యులకు నుద్యోగులకు, భవనములు

దూర్పునఁ గట్టింపఁదగు వీరికి నివాసమున కుత్తరమున వేరువేరుగ నిర్మింపవలయు నెపుడును నృపునింటినుండి యుత్తరమున నూలు, దూరుపున నిస్సాణుశాతులు, నేల విడిచి సైనికులకు, నవుల నవనిపతి భవనమునకు దవ్వుగానే నలుదెసల ధనికోత్తమజాతి క్రమమున జనులకుఁ జెలికాండ్రకు నధికారులకు సేనాపతులకుఁ గాలరులకు రౌతులకుఁ గజాశ్వములకుఁ దత్పాలురకుఁ దుపాకులకుఁ బిరంగులకుఁ నాఁడుగుఱ్ఱములకు నాయుధాభ్యాసులకు మన్నెకాండ్రకుఁ గాపురమున కిమ్మగు నిండ్లు వరుసగ నేర్పఱు చునది బాటసారులకు మంచిజల వసతిగల యతి దృఢమయిన శాల, నిర్మింపవలెను. పురమున నూరనేఁ దూర్పుమొగముదఙ్ముఖముగా నేని యొక్కొకజాతివారి యిండ్ల వరుసలు మొత్తముగ నుండఁదగును బజారులో రాచబాటకు రెండుప్రక్కల ధనికాదిక్రమమునసై యొక్కజాతిసరకుల యంగళ్లనుపవలయు రాజగృహమునుండి నలుప్రక్కలఁ బాటకు వెడలుపు, ముప్పదిచేతులుత్తమము; ఇరువదిచేతులు సాధారణము, పదునేనుచేతు లధమము, మూఁడు, ఐదు, పదిచేతుల వెడలుపుగలవి, వరుసగఁ, బద్య, వీధి, మార్గము, అనఁబడు, గ్రామములఁ బట్టణముల మార్గములు తూర్పు పడమర లుత్తర దక్షిణములునుగ నేర్పఱుపఁజను పట్టణపుఁగోలఁది యరసి పలు రాచబాటలు విభజింపఁదగు రాజధానిం బద్య, వీధినే, నేఱుపఱుపనై, రాదు ఆఱూమడ చదరము గల యడవి, నడుమ నుత్తమము, సాధారణమున, సాధారణము, నధమమున నధమము రాజమార్గము వేయవలయు, ఊరూరఁ బదిచేతులమార్గ, మొకటియేని తప్పక యుండ వలయు ఆత్రోవనేల, తాఁబేటి వీఁపువలె నుండఁజను. నీటిపోకడకు నిరుఁగడలఁ గాలువలు త్రవ్వి గ్రామస్థులు రాకపోకలకు మంచి వంతెనలు వేసికొనవలయు, అన్ని యిండ్లగవఁకులు రాజమార్గమున కెదురుగా నుండఁదగు రెండువరుసల యిండ్లకు వెనుక, వీధియు మలవిసర్జనభూమియు నేర్పఱుపఁదగు. నరపతి, మార్గము, లెదిరించిన వారిచేఁ జెఱసుంచినవారిచేతనేని, కఁకరతో సున్నముతోనే, నేఁటేఁట గట్టిచేయింప వలయు.

రెండేసియూళ్లనడుమఁ దెరువరులకు సాలగట్టించి గ్రామపాలురు, ప్రతిదినము శుభ్రము చేయింపను, జక్కఁగావను,. శాసించునది శాలాధికారి యచ్చటికివచ్చిన బాటసారి నెపుడును “ఎందునుండి, యేలవచ్చితివి? ఎచ్చటికి వెడలెదవు? నిజము చెప్పుము. తోడివారున్నారా? లేరా? ఆయుధములు కలవా? వాహనము కలదా? జాతియేది? తండ్రితాతలెవరు, పేరేమి, నీకుఁ దడవునికియెందు?” అని యడిగి, వ్రాసి, ప్రొద్దు గ్రుంకునపుడు వాని కైదువు చేకొని, పరాకులేక, నిద్రింపుమని నియోగించి, యందున్నవారిని గణించి, యింటితలుపు బిగించి, యారెకులచేఁ గాపించి పఱువాత

మేల్కొలిపి, తలుపుతెఱచి, లెక్కపెట్టి, యాయుధమిచ్చి, విడువఁజను. వారికిఁ బొలిమేరదనుక గ్రామాధికారు లెపుడును దోడ్పడఁదగు. రాజధానినున్న రాజు తెల్లవాఱుజామున మేలుకని, నలుగు గడియలు దినచర్య నిర్ణయింపఁదగు. మన కెపుడును వచ్చుబడియెంత? మాసని వెచ్చమెంత? నిలువధనమున నెంత నెలవైనది? వ్యవహారమున ముద్రించిన వచ్చుబడిని వెచ్చముపోవ మిగతయెంత? అని ప్రత్యక్షమునను వ్రాఁతచేతను దెలిసికొని నేఁడు వ్యయ మింతయగునని యూహించి తగునంత విత్తము, నిలువనుండి తీయఁదగు తరువాత రెండు ముహూర్తములు వేగ విమోచన స్నాన పంచాంగాకర్ణన సంధ్యావందన పురాణపఠన దానములఁ గడపఁదగు. వేసవ గజాశ్వాద్యారోహణ వ్యాయామమున నొక ముహూర్తముఁ, బసదనము లొసఁగుట నొక ఘటికాద్వయము, సుమతియగు నృపతి నలుగడెల జంటలు, కొలుచు, పలువలు, బంగారు, రతనములు, దండులోనగువాని యాయవ్యయముల, నాజ్ఞల, జరుపునది. స్వస్థచిత్తుఁడై మిత్రులతో భోజనమున ఘటీద్వితయముఁ, గ్రొత్త ప్రాఁత వస్తువులు గనుఁగొనుట నొక్క ముహూర్తముఁ, దరువాతఁ బ్రాడ్వివాకాదులు దెలిపిన వ్యవహారమున ముహూర్తద్వయము, వేఁటల, నాటల రెండు ముహూర్తములు, వ్యూహాభ్యాసముల రెండు, సందెవార్చుట నొకఁడు భోజనముచేతనె యొకటి గూఢచారులు వినిచిన వార్తచే రెండు, నిద్రచేత నెనిమిదియుఁగడవఁజేయఁదగు. ఇట్లహోరాత్రములు ముప్పది ముహూర్తములుగఁ బంచి, కాలము నడుపవలెఁగాని, వ్యర్థముగాను స్త్రీ మద్యసేవనములచేతను గూడదు. ఈవిధమున విహరించు దొరకుఁ గడు సుగము దొరకును ఎపుడేది చేయఁదగునో, యపుడది వడిగ సంశయింపక చేయఁజను. కాలమున వృష్టి, యతివృష్టి కారణము అకాలమున నతివృష్టి హేతువు. కార్యస్థానములన్ని, యంతట నెల్లపుడు నలుగు రైదాఱుగురు, గట్టించిన తుపాకులు విచ్చుకత్తులును గల వీరభటులచే, వారి ప్రవర్తనము నమ్రతను బ్రియవాక్యముల నెఱుంగుచుఁ గాపించునది అచటి దినకృత్యముల ముఖ్యలేఖకులవలన వినఁదగు ప్రతిదినముఁ బ్రహరికుల దవ్వుల మార్చఁదగు. యామికుల యింటిద్వార మెపుడు నిండ్లబంతియెదుటనుంచునది. గృహస్థు లిచ్చు జీతమునఁ బ్రతుకు నారెకులచే వారి చారిత్ర మాలింపవలయు. ఊరు వెడలువారిని బ్రవేశించువారిని బూనికతోఁ బరీక్షించి పూఁటకాఁపును నైకొని విడుచునది. ప్రఖ్యాతమైన నడత, స్వభావమును గలవారైన విమర్శింపకయె విడువఁదగు. చోరజారులడంగ నారెకు లన్నివీధుల రాత్రులయందె యరజామున కొకపరి దిరుగవలెను. జనపతి నిత్యముఁ బ్రజల నిట్టు శాసించునది. నాదేశమందున్నవా రెవ్వారును, సేవకు, దాసు, భార్యం, బుత్రుని, ఛాత్రు నేఁబరుసమాడవలదు. తూనికరాళ్లం

గొలపాత్రముల, నాణెముల, నింగువ మొదలగు జిగటల, లోహాదుల, తేనె, పాలు నేయి, క్రొవ్వు, పిండి, లోనగువానియందు, మాయఁజేయనేరాదు బలిమిని బత్రము వ్రాయించికొనఁజనదు లంచముపుచ్చికొనఁదగదు. ప్రభు కార్యప్రతారణ మొనరింప వలదు. చెడ్డపనిచేయువానిం, జోరునిం, జారునిఁ, దక్కిన యపకారులను, శత్రుల, మిత్రులనేని రహస్యముగ రక్షింపకుఁడు. ఎవరును దల్లిదండ్రులఁ, బూజ్యులగు విద్వాంసుల, సచ్ఛారిత్రులఁ దిరస్కరింప నవహసింపను జనదు భార్యాభర్తలకుఁ, బోష్యపోషకులకు, నన్నదమ్ములకు, గురుశిష్యులకుఁ దండ్రికొడుకులకు జగడములు పెట్టకుఁడు దరిద్రుల, నంధబధిరాదుల, బావుల, నూతులఁ, దోఁటలఁ, బొలిమేరల, ధర్మసత్రముల, దేవాలయముల, మార్గములను బాధింపఁ దలంపకుఁడు రాజు నానలిఁ బూనకయె, జూదమాడకుఁడు. వెర్రినీళ్లు త్రావకుఁడు. వేఁటకేగకుఁడు కైదువులు పట్టకుఁడు, మానుసుల, నేనుఁగుల, మాంపుల, సుంకెల, నెనుముల, నావుల, స్థావరములు, వెండి బంగారముల, రతనములఁ, నైపువస్తువుల, విషములఁ గొనుట నమ్ముటను మానుఁడు. సారాయితీయకుఁడు. దానక్రయపత్రములు, నష్టఁదీర్పు బత్రములు వ్రాయకుఁడు వైద్యముచేయకుఁడు. బ్రహ్మహత్యాది మహాపాతకములుచేసెననరాదు పాఁతులు గొనవలదు. క్రొత్తసమాజపుఁ గట్టుపాటుఁ, దీరుపును జేయఁగూడదు. కొలముఁ జెఱుపఁదగదు. అధిపతిలేని నష్టధనమును నేకరింపఁజనదు రహస్యము వెల్లడిఁజేయకుఁడు, దారదోసము లోపము నెన్నఁడును వాడకుఁడు స్వధర్మత్యాగము, కల్ల, పరభార్యలఁబట్టుట, యబద్ధపుసాక్ష్యము, దొంగపత్రము, రహస్యముగ దానము పట్టుట, నిర్ణీతముకంటె నెక్కువ పన్నుగొనుట, మ్రుచ్చిమి, తెగువ, స్వామిద్రోహమును దలంపనేరాదు జీతమున, సుంకమున, భాగమున, వడ్డిని, గ్రొవ్వున, బలిమిని, మోసమున నేవాని నెపుడును దిరస్కరింపకుఁడు కొలగొలుసులు, తూఁచురాళ్లు, కుంచములు మొదలైనవి రాజముద్రితములై వాడవలయు, జనులందఱు గొనమలవరించు కొనఁగడు జాణలు గావలయు. ఇండ్లంటించినవాండ్రు, విసముపెట్టినవాండ్రు, కైదువు చేపట్టినవాండ్రు, రొక్కపు దోఁపరులు, పొలములఁ బెండ్లాల నటిమినవాండ్రు, ఈ యాఱు తెగలవాండ్రు నాతతాయులు నాఁబడుదురు వీండ్రం బట్టి కట్టి దండాధికారి కొప్పింపుఁడు. ఆఁబోతులు మొదలైనవాని, విడిచినవారె గట్టిగఁగట్టి మేపికొనఁ జను. నా శాసనము లివి మీఱి నడిచిన పాపకారుల మహాదండవినష్టులను జేసెదనని యెపుడు నేలుబడి తప్పెటలఁ జాటి తెలుపునది చట్టములు వ్రాయించి నడువీధుల నడుమఁ గట్టింపనువలయు చెడుగులఁ బగతుర నెపుడును దత్క్షణమె దండించునది. రాజు నీతితోనె, ప్రజలఁ గావఁదగు బాటసారుల సుఖముకై దారులు గాపాడవలయు.

వెరువరులనలంచుచాండ్రఁ బూనికతో మట్టుపెట్టవలెను ఊరి సంవత్సరపు వచ్చుబడి యాఱుపాళ్లు చేసి, యందొక యంశపుసామున గ్రామాధిపతుల నియమించి, యొక యర్థ భాగము మంత్రులకు, నొక సగపాలుద్యోగులకు, నొక సాఁబాలు స్వభోగమునకు, మూఁడుపాళ్లు దండునకు, నొక యరవఱుదానమునకుఁ, దక్కిన పంద్రెండవ యంశము నిలువకు నేర్పఱుచునది సామంతాదుల కిది ధర్మముగాని తక్కిపెద్దర కెన్నఁడుఁ గాదు. రాజ్యము, యశము, సత్కార్యము, ధనము, గానము నచ్చినవి గాచికొన నప్రాప్తములఁ గడింపఁ జాలుమూలక మేలిజతనముఁ జెందునది, మగఁటిమి, పాండిత్యము, మాటచదురు, చాగము, బలిమి, యలుకము, నెపుడు నెత్తువచ్చుట యను నేడింటిని బుడమిఱేఁడు విడువఁదగదు కయ్యమున నాత్మీయకార్యములఁ బోషకుని కర్జమునఁ బ్రాణభయము వీడి జంకక పోరువాఁడు శూరుఁడు. పక్షము విడిచి, జతనమున బాలుఁడాడినదియైన మేలిమాట గ్రహించి నాయకుని నిజముఁ గనుగొన్నవాఁడు, పండితుఁడు ఎదుట జడియక కానిదియైన దోసము లుగ్గడించి గానముతో సరిగ వాని నెన్నఁడును మెచ్చనివాఁడు వక్త ఈయరానిదని తలంపక పాత్రమునఁ గళత్రపుత్రాదులఁ దన్ను నర్పించువాఁడు, దాత. సంహరింప నూరుపుఁ దలంపమికతము బలము, శత్రు నరవరాదులఁ గింకర సంకాశులఁ జేయునది పరాక్రమము యుద్ధమునకు సన్నద్ధుఁడుగా నుండుట యుత్థానము. విషసంపర్కము వలన వెఱచి యన్నము, కోఁతులు, కోళ్లు లోనగువానికి వేసి పరికింపఁజను అంచలు తొట్రుపడును. తుమ్మెదలు రొదసేయును. నెమిళ్లాడును కోడి, కూయును. కొంచ, క్రైపొందును కోఁతి, పురీషము విడుచును ముంగి, పులకించును గోరువంక, గ్రక్కును విసము కలిసిన యన్నము నిట్లు తెలియనగును గాన నాహారమును బరీక్షించునది షడ్రసోపేతముగ నారగింపవలెఁగాని రెండుమూడు చవులు గానే, హెచ్చుతగ్గు కారముఁ దీపు నుప్పు గానేని భుజింపవలదు విన్నవించిన కార్యమును మంత్రులతో వినఁజను ఆరామాంతులందు నరులతో నారులతో నట గాయక పారశైంద్రజాలికాదులతోఁ బరాకులేక విహరించునది ఎల్లపుడు వేకువ మునిమాపునను నేనుఁగులు గుఱ్ఱముల రథములు నెక్కి విహరింప నభ్యాస మొనర్చునది సిపాయిలకు నెద్దుల పన్నుగడ దానేర్పను నేర్పింపనగు. బెబ్బులులు మొదలగు నడవి మెకములను మయూరాది విహంగములను నాడించునది దుష్టజంతువుల ద్రుంచుచు వేఁటలాడునది బీరము పెఱుగుట, గుఱితప్పక కొట్టనలవాటు, నిర్భయత్వము, బాఁకులు తుపాకులు వడిగ నడపుటయు వేఁటవలని లాభములున్నను హింసవలని వృజిన మతిఘనము. ప్రజలకు నుద్యోగులకు మంత్రులకు శత్రువులకు సైనికులకు సభికులకుఁ జుట్టములకు నంతిపురపు

టింతులకు నిష్టము చేష్టలు జతనములు నెట్టివో వేగరులవలన వినవలెను హానికార్యమైన మాపునను సర్వదా యాలించునది పరాకులేక యొఱదీసిన కత్తులు చెకుముకి తుపాకులు నొద్ద నిడికొని, విన్నది వ్రాయవలయు కల్లలాడు చారుని దండింపని రాజు, ప్రజల యసువుల ధనములను గొను మ్లేచ్ఛుఁడనఁజను బ్రహ్మచారి, తపస్వి, బోడ్డ, నీచ, జోగి, ఈవేసములు దాల్చిన చారుని మాయనె కనుగొని తీర్పవలెను వానిఁ బరీక్షింపక నిజమెఱుంగఁజాలమి సంతాపమొందును పరికి పని దొరవలనఁ జరుఁ డనృతమాడ వెఱవఁడు మంత్రులవలన నధికారులవలనను వేగరిని గావఁజను ధరావరుఁడు రాజ్య మేకనాయక మొనరింపవలెఁగాని బహు నాయకము ననాయకమును జేయ నెన్నఁడును గోరరాదు. రాచకొలమునఁ బలువురు పురుషులున్న జ్యేష్ఠుఁడు దొర, యన్యులతనికి సహాయులును గావలయు అందఱు సహకారులకంటెఁ గడు గౌరవము గలవారు మేలియఁజాలుదురు జ్యేష్ఠుఁడును గ్రుడ్డి, చెవిటి, మూఁగ, పేడి, కుష్ఠియేనైన, సోదరుఁడు నతనికొడుకునె గాని, దొరతనమునకుఁ దగమి నిశ్చితము తనకంటెఁ జిన్నమైన నన్నకొడుకె దొర, కాఁదగు అన్న, యన్నకొడుకును లేకున్నఁ దమ్ములు రాజార్హులు కులమువారి నైకమత్యము భూకాంతునకుఁ బరమశ్రేయస్కరము భేదము రాజ్యమునకుఁ గొలమునకు హానిహేతువు గనుక రాజు తన దాయాదులఁ దనవలె భోగుల నొనరించునది అప్రతిహతాజ్ఞా శ్వేతాతపవారణ సింహపీఠములచేత నేఁదనియవలయు రాజ్యము పంచికొనుటవలన రాజునకు మేలుగలుగదుగదా విభాగమునఁ గొంచెమైనరాజ్యమును బగతురు గ్రహింపఁగోరుదురు, నృపతి యెపుడును రాజ్యము నాలవపాలిచ్చి, వారినంతట నిలుపనే, నలుదెసల దేశాధిపతుల నొనర్పనేని, గోగజాశ్వోష్ట్రకోశాధికారముల నియమింపనేనియు వలయు మాత, మాతృతుల్యయేని, వంటయింటనిలుపఁదగు బంధుగులు, భార్యాసోదరులు, సేనాధికార మీయఁదగు వారు. గురువుల మిత్రులఁ, దనదోసములు దెలుప నిర్ణయించునది వలువలు, రవణములు, పాత్రములు చక్కఁగ గనుఁగొన వనితల కానతీయవలెను. తానన్నియుఁ బరికించి క్రమమున ముద్రింపవలయు. రాత్రి యింటినడుమను, బవలు పరీక్షించిన యడవిని, విజనమున మంత్రులతో భావికార్య మారయునది ఆస్థానమునఁ జెలికాండ్రతోఁ దోఁబుట్టులతోఁ గొడుకులతోఁ జుట్టములతోఁ బడవాండ్రతో సభాసదులతోడను రాచకర్జ మరయఁదగు. ఓలగపుఁ బడమటి సగము నడుమ నొడయని పీఠమునుంచఁజను ప్రక్కగదులవారు కుడి యెడమలఁ గూర్చుండఁ, గొడుకులు, దత్పుత్రులు, తోఁబుట్టులు, మేనల్లురు, కూఁతులకొడుకులును దనవెనుక వరుసగఁ గుడినుండి యెడమదనుక నుండఁ దండ్రితోఁబుట్టులు, దనకొలమున నుత్తములు, సభాసదులు, సేనాధి

పతులు తనయెదుటఁ గుడిప్రక్కఁ దూర్పున వేర్వేఱుపీఠము లాశ్రయింపఁదగుదురు తల్లివంగసమున శ్రేష్ఠులు, మంత్రులు, బంధువులు, భార్యజనకులు భ్రాతలు నధికారులు నెదుట నెడమను, నల్లుఁ డెడమప్రక్కను, దోఁబుట్టువెనిమిటి, కుడివైపున, తనసాటి నెచ్చెలి, చేరువనే, నరయుగపుననేని, కూఁతు దోఁబుట్టుల కొడుకులచోటఁ, బెంపుడుఁ గొడుకులు మొదలగువారు, తండ్రివలె నాచార్యుఁడు సరి మేలిపీఠమున, ప్రాంత కాంద్రందఱు మంత్రులవెనుక నెదుట గిరుచక్కిని, భృత్యుల సంఘములన్నియు నందఱకు వెన్నుదన్ని, రాక జోహారులను దెలుపు పైఁడి బెత్తముల బంట్లిరుఁగడ నుండవలెను రాజు పెఱలుపయోగింపని చిన్నెలతోఁ జక్కని యాభరణములు వలువలు ధరించి కవచము దొడిగికొని కిరీటము దలనిడికొని ఆయితమైన యాయుధములతో, నేక్షణమును బరాకుపడక దన పీఠమున సుఖముగఁ గూర్చుండవలయు "సర్వాధికుఁడవు, చాగకాఁడవు, గండఁడవు, ధార్మికుఁడవు నవుదువని వినుచు మోసగాండ్ర నుడువు లాలింపరాదు. దొరవలని వెఱపునఁ, బేరాసం, బిసినితనమున మంత్రులు మూఁగలవలె నుందురు. వారనుమతించిరని తలంపక యవనిపతి తన కర్జము నెఱవేఱ, వేర్వేరఁ దద్భావముల, యుక్తులతో వ్రాయించి, తన బుద్ధిచేతనె పరికించి బహుసంమత మొనర్చునది. సైనిక సేవక పరిచారక గజతురగ రథపశ్వాది సంభారముల కార్యనిర్వాహకతఁ, బ్రతిదినమెఱింగి, కడకంగాచుచు, సుమతి, వసుమతీపతి, యతిజీర్ణముల వదలునది ఒకదినమున నూఱుకోసులదూరపువార్త యందింపవలెను వేతన పోషితులచే నెల్ల విద్దెలు కళలు నేర్పించునది విద్య పూర్ణముగ నేరిచినవానిఁ జక్క నరసి యా యుద్యోగమున నియమించునది విద్యాకలలు వృద్ధినొంద, నందు మేలుబంతులఁ గనుంగొని యేఁటేఁటఁ బసదనము లొసఁగునది వెఱపించు వేసము, క్రొముక్కఁ జక్కనడువ నేర్పునుగలిగి, గట్టించిన తుపాకులు నెఱవెటికిన పట్టెములునుగల జోదుల ముందువెనుకల, నదూరమున నిలువవలయు. అనుదిన మేనుఁగునెక్కి, రాజధాని జనులు సంతసమొంద సంచరింపవలెను. రాజయానము నెక్కుటంగుక్క, రాజుతో, రాజు, కుక్కతోను సరియని కవులు వడినుడువరా? కావునం గొనములఁ దన సాటిగాంచు బంధుమిత్రమంత్రిజనులతో జనపతి వయాళి వెడలవలెఁగాని యసదుగ నెన్నఁడును నడువరాదు. సత్యాచారులు సాధువులు అసత్యాచారులు నీచులు. తులువలు సాదులకుఁ దమ యతిమృదుత్వమె ప్రకటింతురు ఊళ్లు, పురములు దేశములు నేఁటికొకమాటు గ్గాఁగాంచి, తన యధికారు లేప్రజలకే మేలుచేసిరో యెవరికిఁ గీడుచేసిరో, నిక్కమెఱింగి, సేవకపక్షమువిడిచి, ప్రజాపక్ష మాశ్రయించి బహుజనవిరోధియగు నధికారిని దొలఁగింపవలయు. ఒకసారి తప్పుదారి నడచిన మంత్రిని

నారసి, యేకాంతమున దండింపఁజను పలుమాఱు నేరములుచేసినవాని బాహిరముగ వీడఁదగు నరపతి యన్యాయవర్తుల రాజ్యము సర్వధనమును జేకొనఁజను. తాఁ గెలిచినవారి దేశముల నెల్లప్పుడు న్యాయస్థానము నిలుపునది ఓడినవారికి జీతములు నడతకుఁ దగునట్లు లీయఁజను. తనపై వలపు, చక్కఁదనము, జిలుఁగు వలువలు, మెఱయుతొడవులు, గరగరికయుఁగల నెలఁతందలి మమ్మునఁజెందునది రెండుజాములు నిదురించువాఁడు గడు సుఖపడును. తన నెలవు విడువకయె నీతిస్మార్తురఁ బరిమార్చునది పండ్లు, తలవెండ్రుకలు, గోళ్లు నెకిమీంద్రు నిరవు విడిచిన శోభచెడును. గొప్పయిడుమ నెపుడును బడమిఱేఁడు కొండగవుల నిలువఁదగు అందుండి చోరవ్యాపారమునఁ దన రాజ్యమును సాధించునది చదువరులు నారులు వల్లరులు నాశ్రయము లేమిఁ గృతార్థులుకారు' ఇంట్లికి, జన్మమున, కీవికి, నవు ధనముఁ దప్పఁ దక్కు ధనమున నెనిమిదియవపాలు మిత్రులనిచ్చి, సుజనుల రొక్కము, గుజనధన మశేషమును దోఁచి కొనఁజను. ఎపుడు నొక్కయిరవున నిలువఁగూడదు ఎవనిని నమ్మనేరాదు ఎల్ల కాలము పరాకుఁబూనకయే యుండవలెను ప్రాణభంగమునకు వగవఁజనదు ఎపుడు నడుముకట్టి దోఁపుడుఁబనులఁ గనికరముమాలి, దారుణకార్యములు చేయువాఁడైనఁ బరభార్యలకు మొగము మరలించుచుఁ గొలపుఁ గన్నెలఁ జెఱుపకుండఁదగును బిడ్డల వలెఁ బెంచిన లెంకలుతటిఁ బగతురగుట యదృష్టమె కాని ప్రయత్నలోపము కాదు పౌరుష మత్యంత విఫలమగుట యెఱింగి తపము సలిపి దివికేగునది ఇది రాజకార్య సంగ్రహము మిశ్రమున విస్తరించెద

ఇది శుక్రనీతిసారమున రాజకార్యారంభాహ్వయము ప్రథమాధ్యాయము

ద్వితీయాధ్యాయము.

అరయఁ గడుఁ జిన్నపనియైన నసహాయుఁడైన యొక పురుషుఁడు చేయఁ దరము, గాదన్నచో మహాఫలమువు రాజ్యముమాట చెప్పవలెనా? నరవరుఁ డన్నివిద్దెల నేరుపరియై చక్కఁగ నాలోచింపఁజాలినను, మంత్రులతోఁ దక్క, నొక్కఁడును, గార్య మేదియే నెపుడు నారయఁ దగదు. ఎపుడును బ్రాజ్ఞుఁడగు నరపతి, తగవరులకు నధికారులకు బ్రజలకు సభాసదులకు సంమతమునై యాచరింపవలయుఁగాని విచ్చలవిడి నడువరాదు. సర్వంసహాకళత్రుఁడు స్వతంత్రుఁ డయ్యెనేని కీడె మూఁడును.